ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



విశాఖపట్నం

జిల్లా వార్తలు

గురువారం 14 మార్చి 2024

కొత్త డిజైన్‌తో ఫ్లోటింగ్ బ్రిడ్జి

- హై డెన్సిటీ బ్లాకులతో నిర్మాణం
- ముంబై నుంచి నిపుణుల రాక

నగరంలోని రామకృష్ణా బీచ్‌లో ఏర్పాటు చేసిన ఫ్లోటింగ్ బ్రిడ్జి అలల తాకిడిని తట్టుకోలేక పోతుండడంతో దాని డిజైన్‌ను మార్చాలని నిర్ణయించారు.



...వివరాలు IIలో

టికెట్ టెన్షన్

నేడు టీడీపీ మలి జాబితా విడుదల



శ్రీభరత్



పల్లా శ్రీనివాసరావు



వంశీకృష్ణ శ్రీనివాస్



పంచకర్ల

- గాజువాకకు పల్లా శ్రీనివాసరావు
- భీమిలిపై ఉత్కంఠ
- రేస్‌లో గంటా శ్రీనివాసరావు, కర్రోతు బంగార్రాజు, కోరాడ రాజబాబు
- పార్లమెంటు స్థానానికి ఎం.శ్రీభరత్ పేరు ఫైనల్
- జనసేనకు 'సౌత్', పెందుర్తి
- ఇక్కడ వంశీకృష్ణ, అక్కడ పంచకర్ల పేర్లు ఖరారు
- బీజేపీకి 'నార్త్'... మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు అవకాశం

విశాఖపట్నం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి):

తెలుగుదేశం, జనసేన, బీజేపీల మధ్య పొత్తు కొలిక్కి రావడంతో అభ్యర్థుల ఎంపికపై ఆయా పార్టీల అధినేతలు దృష్టిసారించారు. తెలుగుదేశం, జనసేన పార్టీలు మలి విడత జాబితాలను, భారతీయ జనతా పార్టీ తొలి జాబితాను గురువారం ప్రకటించనున్నట్టు సమాచారం రావడంతో ఆశావహుల్లో టెన్షన్ నెలకొంది.

విశాఖపట్నం జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు (ఆరు పూర్తిగా, మరొకటి పాక్షికంగా) ఉండగా...తెలుగుదేశం పార్టీ నాలుగు (భీమిలి, విశాఖ తూర్పు, పశ్చిమ, గాజువాక), జనసేన రెండు (విశాఖపట్నం సౌత్, పెందుర్తి), బీజేపీ ఒక (విశాఖపట్నం నార్త్) చోట పోటీ చేయనున్నాయి. ఆ మేరకు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు తొలి జాబితాలో విశాఖ తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలకు సిట్టింగ్ ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, పి.గణబాబుల పేర్లు ప్రకటించారు. జిల్లాలో మిగిలిన గాజువాక, భీమిలి అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థుల పేర్లు గురువారం ప్రకటించే అవకాశం ఉందంటున్నారు. గాజువాక సీటు పార్టీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు దాదాపు ఖరారైంది. కాగా భీమిలి విషయంలో ఇంకా సస్పెన్స్ కొనసాగుతోంది. భీమిలి సీటును మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావుతో పాటు, నియోజకవర్గ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు, విజయనగరం జిల్లా నెల్లిమర్ల ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు ఆశిస్తున్నారు. అయితే గంటాను విజయనగరం ... మిగతా 6వ పేజీలో

ఆశావహుల్లో ఉత్కంఠ

- చోడవరం, మాడుగుల టికెట్లకు రేస్‌లో ముగ్గురేసి...
- బీజేపీకి అనకాపల్లి ఎంపీ స్థానం
- అధిష్ఠానం పరిశీలనలో సీఎం రమేశ్ పేరు



సీఎం రమేశ్

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకుగాను పొత్తులో భాగంగా టీడీపీ నాలుగు, జనసేన మూడు స్థానాల్లో పోటీ చేయాలని నిర్ణయించాయి. నర్సీపట్నం నుంచి చింతకాయల అయ్యన్నపాత్రుడు, పాయకరావుపేట నుంచి వంగలపూడి అనిత, అనకాపల్లి నుంచి కొణతాల రామకృష్ణ పేర్లను ఆయా పార్టీల అధినేతలు తొలి విడత జాబితాల్లో ప్రకటించిన విషయం తెలిసిందే. ఇక టీడీపీ మరో రెండు (చోడవరం, మాడుగుల) నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. చోడవరం టికెట్ రేసులో నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గూనూరు మల్లునాయుడు ఉన్నారు. మాడుగుల టికెట్‌ను నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, పైలా ప్రసాదరావు ఆశిస్తున్నారు. వీరిలో ఒకరికి టికెట్ ఇవ్వాలా? లేకపోతే పొత్తులో భాగంగా పెందుర్తి స్థానాన్ని జనసేనకు కేటాయించడంతో గత ఎన్నికల్లో అక్కడి నుంచి పోటీ చేసిన మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తికి మాడుగుల టికెట్ ఇవ్వాలా? అనే దానిపై అధిష్ఠానం కసరత్తు చేస్తున్నట్టు తెలిసింది.

అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థిగా సీఎం రమేశ్?

మూడు పార్టీల పొత్తులో భాగంగా అనకాపల్లి ఎంపీ సీటును బీజేపీకి కేటాయించినట్టు ... మిగతా 6వ పేజీలో

రోడ్డునపడ్డ మానసిక దివ్యాంగులు

మూడేళ్ల కిందట పాఠశాలను ఖాళీ చేయించిన జీవీఎంసీ అధికారులు

- వైసీపీ నాయకుల ఒత్తిడే కారణమని విమర్శలు
- లీజు గడువు ముగిసిందనే నెపంతో చర్యలు
- మూడు రోజుల్లో ప్రత్యామ్నాయం చూపిస్తామని హామీ
- మూడేళ్లు గడిచినా కన్నెత్తి చూడని యంత్రాంగం
- అద్దె భవనంలో చిన్నారుల అవస్థలు



అడవిని తలపిస్తున్న హిడెన్ స్ప్రౌట్స్ మానసిక పాఠశాల నడిచిన ప్రాంగణం

పెదవాల్తేరు, మార్చి 13:

ఎంతోమంది మానసిక దివ్యాంగులను అక్కున చేర్చుకున్న 'హిడెన్ స్ప్రౌట్స్' పాఠశాల ప్రస్తుతం దిక్కులేని పరిస్థితిలో రోడ్డుపైకి వచ్చి చేరింది. జీవీఎంసీకి చెందిన స్థలంలో భవనాలతో దివ్యాంగులకు బాసటగా నిలిచిన ఈ పాఠశాల రాజకీయ ఒత్తిళ్లకు బలైపోయింది. లీజు గడువు ముగిసిందనే కారణాన్ని చూపి జీవీఎంసీ అధికారులు 2021 జూన్ 5న మానసిక పాఠశాలను బలవంతంగా ఖాళీ చేయించేశారు. కేవలం మూడు రోజుల్లో ప్రత్యామ్నాయం చూపిస్తామని హామీ ఇచ్చిన అధికారులు మూడేళ్లు దాటుతున్నా పట్టించుకోలేదు. దీంతో పరాయిపంచన, చాలీచాలని వసతులతో మధ్య చిన్నారులు అవస్థలు పడుతున్నారు.



రోడ్డుపైనే భోజనం చేస్తున్న మానసిక దివ్యాంగులు

విశాఖ నగరం పెదవాల్తేరులో 'హిడెన్ స్ప్రౌట్స్' మానసిక దివ్యాంగుల పాఠశాలను 2006లో పది మంది విద్యార్థులతో ప్రారంభించారు. అనంతర కాలంలో ఈ పాఠశాలలో సుమారు 200 మంది వరకు చేరారు. వారికి వివిధ అంశాల్లో శిక్షణ ఇచ్చేందుకు వీలుగా 30 మంది సిబ్బంది పనిచేసేవారు. ఒకేషనల్ కోర్సులు, క్రీడలు, ఫిజియో థెరపీ, స్పీచ్ థెరపీ, బుక్ బైండింగ్, బొమ్మలు గీయడం, మగ్గం వర్క్స్, ప్రమిదల తయారీ వంటివి నేర్పించేవారు. దివ్యాంగులకు ఉచిత రవాణా, భోజనం, యూనిఫాం సమకూరేవి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నగరంలోని అనేక స్థలాలను సొంతం చేసుకోవాలనే యోచనలోని కొంతమంది నాయకులు ఈ పాఠశాల జీవీఎంసీకి చెందిన స్థలంలో ఉందని గుర్తించి, తమ అవసరాలకు వినియోగించుకునేందుకు వీలుగా ఖాళీ చేయించాలని భావించారు. దీంతో అధికారులు రంగంలోకి దిగి, లీజు గడువు ముగిసిందనే కారణాన్ని చూపించి బలవంతంగా ఖాళీ చేయించారు. మూడు రోజుల్లో ప్రత్యామ్నాయ స్థలం చూపిస్తామని, అక్కడ పాఠశాల ఏర్పాటు చేసుకోవచ్చునని హామీ కూడా ఇచ్చారు.

రేకుల షెడ్డే ఆవాసం...

ఈ క్రమంలో పెదవాల్తేరు ఇందిరానగర్‌ను ఆనుకుని ఉన్న శెట్టిబలిజవారివీధిలోని ఒక చిన్న రేకుల షెడ్డులో ... మిగతా 6వ పేజీలో

నిధులకు ఉక్కు కటకట!!

అందుబాటులో లేని ముడి పదార్థాలు

- బయట అధిక ధరకు కొనుగోళ్లు
- ఉత్పత్తి వ్యయం పెరగడంతో నష్టాలు
- మూడో బ్లాస్ట్ ఫర్నేస్ ప్రారంభించినా ఫలితం శూన్యం



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం స్టీల్ ప్లాంటు పరిస్థితి పెనం పైనుంచి పొయ్యిలో పడినట్టయింది. మూడో బ్లాస్ట్ ఫర్నేస్ ప్రారంభించినా ఉత్పత్తిలో పురోగతి కనిపించడం లేదు. ప్లాంటును లాభాల బాటలోకి తీసుకువెళతామంటూ డిసెంబరు నెలాఖరులో బ్లాస్ట్‌ఫర్నేస్-3ని ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు మూడు ఫర్నేసులను ఆటంకం లేకుండా పట్టుమని పది రోజులు కూడా నడపలేదు. రెండు రోజులకు ఒక బ్లాస్ట్ ఫర్నేస్‌ను షట్‌డౌన్ చేస్తున్నారు. ముడి పదార్థాలు లేకపోవడమే దీనికి ప్రధాన కారణం. పదిహేను రోజులకు సరిపడా ఐరన్‌ఓర్, కోకింగ్ కోల్ నిల్వలు ఉండాలి. కానీ రెండు, మూడు రోజులకే ఉంటున్నాయి. దీంతో అత్యవసరమని బయట అధిక ధర పెట్టి కొంటున్నారు. ఉత్పత్తి వ్యయం పెరిగిపోతోంది. నష్టాలూ అధికమవుతున్నాయి.

కోకింగ్ కోల్‌ను విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాలి. ఒక షిప్‌ను బుక్ చేసుకుంటే రూ.150 కోట్లు వరకు ఉండాలి. ఇక్కడి పోర్టుకు చేరాక దానిని విడిపించుకోవడానికి కస్టమ్స్ డ్యూటీగా మరో రూ.10 కోట్లు కట్టాలి. అన్ని డబ్బులు లేకపోవడంతో స్థానికంగా దొరికే కోకింగ్ కోల్‌ను, లేదంటే కోక్‌ను కొంటున్నారు. కోకింగ్ కోల్ తెచ్చుకొని ఓవెన్ల ద్వారా కోక్ తయారు చేసుకుంటే టన్ను రూ.23 వేలు పడుతుంది. కానీ బయట రూ.40వేలు చొప్పున కొంటున్నారు. అదనంగా టన్నుకు రూ.17 వేలు పెడుతున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు ఇలా లక్ష టన్నుల వరకు కొనుగోలు చేశారని కార్మిక వర్గాలు చెబుతున్నాయి.

ఐరన్‌ఓర్ అరకొరగా

ఎన్ఎండీసీ ఐరన్‌ఓర్, ఫైన్స్ సరఫరా చేయాల్సి ఉంది. అరకొరగా ఇవ్వడం వల్ల పెల్లట్స్ కొని ఉపయోగిస్తున్నారు. వీటిని వాడితేనే నాణ్యమైన స్టీల్ తయారవుతుంది. సాధారణంగా ఫైన్స్‌తో సింటర్ ద్వారా పెల్లెట్స్ తయారుచేస్తారు. ఫైన్స్ టన్ను రూ.5 వేలు పడుతుంది. అవి రాకపోవడం వల్ల బయట పెల్లెట్స్‌ను టన్ను రూ.12 వేలు పెట్టి కొంటున్నారు. ఇవన్నీ తాత్కాలిక నిర్ణయాలతో జరుగుతున్నవి కావడం గమనార్హం. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 70 వేల టన్నుల పెల్లెట్స్ కొన్నారని చెబుతున్నారు. ఇలా అసాధారణమైన ధరలకు బయట ముడిపదార్థాలు కొని అరకొరగా ఉత్పత్తి చేయడం వల్ల వ్యయం పెరిగి, నష్టాలు వస్తున్నాయని కార్మిక వర్గాలు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. మూడు బ్లాస్ట్ ఫర్నేసులతో పనిచేస్తున్నామని బయట చెప్పుకొంటూ లోపల ఉత్పత్తి పడిపోయేలా చేస్తున్నారని, యాజమాన్య నిర్వహణ సరిగ్గా లేదని, తక్షణమే సెయిల్‌లో విలీనం చేయాలని అధికార, కార్మిక వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఓపెన్ స్కూలు పరీక్షలకు వసూళ్లు?



మాస్ కాపీయింగ్‌కు అవకాశం కల్పిస్తామంటూ అభ్యర్థుల నుంచి డబ్బులు వసూలు

- టెన్త్‌కు రూ.5 వేల నుంచి రూ.10 వేలు
- ఇంటర్‌కు రూ.12 వేల నుంచి రూ.15 వేలు
- కొన్ని స్టడీ సెంటర్లలో కలెక్షన్
- 18 నుంచి ప్రారంభంకానున్న పరీక్షలు

విశాఖపట్నం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూళ్లు) ఆధ్వర్యంలో ఈనెల 18వ తేదీ నుంచి జరగనున్న పదో తరగతి, ఇంటర్ పరీక్షలకు హాజరుకానున్న అభ్యర్థుల నుంచి కొందరు భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారు. ఓపెన్ స్కూళ్ల పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు బోధనా తరగతులు నిర్వహించే స్టడీ కేంద్రాల నిర్వాహకులు కొందరు ఈ వ్యవహారంలో కీలకపాత్ర పోషిస్తున్నారు. పరీక్షా కేంద్రాల్లో మాస్‌కాపీయింగ్‌లో సహకరించడానికి పదో తరగతి పరీక్షలు రాసే అభ్యర్థి నుంచి సగటున రూ.ఐదు వేలు, ఇంటర్ అభ్యర్థుల నుంచి రూ.10 వేల వరకు వసూలు చేస్తున్నట్టు ప్రచారం సాగుతుంది. ఓపెన్ స్కూళ్ల విభాగంలో పనిచేసి జిల్లాల విభజనలో పొరుగు జిల్లాకు బదిలీ అయిన వ్యక్తి కనుసన్నల్లో ఇదంతా జరుగుతుందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. టెన్త్, ఇంటర్ అభ్యర్థుల నుంచి రూ.కోటి వరకూ వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెబుతున్నారు.

విశాఖ జిల్లాలో పదో తరగతి పరీక్షలకు 15 స్టడీ కేంద్రాల ద్వారా 980 మంది, 21 కేంద్రాల ద్వారా 1,100 మంది ఇంటర్ పరీక్షలు రాసేందుకు ఫీజులు చెల్లించారు. సార్వత్రిక విద్యాపీఠం నిర్ణయించిన మేరకు పదో తరగతికి రూ.2,250, ఇంటర్ పరీక్షలకు రూ.మూడు వేలు ఫీజు కింద చెల్లించాలి. ఫీజు చెల్లించి స్టడీ కేంద్రాల్లో నమోదైన అభ్యర్థులకు సార్వత్రిక విద్యాపీఠం నుంచి మెటీరియల్ ఇస్తారు. సెలవు దినాల్లో స్టడీ కేంద్రాల్లో బోధనా తరగతులు నిర్వహించాలి. కానీ జిల్లాలో ఎక్కడా తరగతులు నిర్వహించే దాఖలాలు లేవు. సాధారణంగా పలు కారణాలతో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లని అభ్యర్థులు ఓపెన్ స్కూళ్ల ద్వారా టెన్త్, ఇంటర్ పరీక్షలకు హాజరవుతుంటారు. ఇంకా ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు కొందరు ఓపెన్ స్కూళ్ల ద్వారా పరీక్షలు రాస్తారు.

అయితే సార్వత్రిక విద్యాపీఠం అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో జిల్లాలో పలు స్టడీ కేంద్రాల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రామాటాకీస్ వద్ద మూతపడిన ఒక ప్రైవేటు జూనియర్ కళాశాల నుంచి కొందరు ఇంటర్ పరీక్షలకు హాజరయ్యేందుకు ఫీజులు చెల్లించారు. గత ఏడాది ఇదే కళాశాల నుంచి ఎక్కువ మంది పరీక్ష రాశారు. అయితే వారిలో పరీక్ష తప్పిన సుమారు 20 మంది ఈ ఏడాది పరీక్షలకు హాజరు కోసం ఫీజు చెల్లించారు. ఇంటర్ బోర్డు నుంచి అనుమతి లేని కళాశాల నుంచి సార్వత్రిక విద్యాపీఠం అధికారులు ఏ విధంగా ఫీజులు కట్టించుకుని, అభ్యర్థులకు పరీక్షల కోసం హాల్‌టికెట్లు జారీచేశారో అర్థం కావడం లేదు. అలాగే మధురవాడలో ఒక ప్రైవేటు కళాశాల నుంచి ఏకంగా 100 మందికిపైగా ఇంటర్ పరీక్షలు రాసేందుకు ఫీజు చెల్లించారు. అధికార పార్టీకి చెందిన నాయకుడికి చెందిన కళాశాల కావడంతో అధికారులు ఏకంగా 100 మందికిపైగా అభ్యర్థులకు అనుమతి ఇచ్చారన్న ఆరోపణలు వెల్లువెత్తు తున్నాయి.

టెన్త్, ఇంటర్ అభ్యర్థులకు ఈనెల 18వ తేదీ నుంచి పరీక్షలు జరగనున్నాయి. హాల్‌టికెట్లు ఇస్తున్నారు. పరీక్షలలో మాస్‌కాపీయింగ్‌కు అనుమతించేందుకు అభ్యర్థుల నుంచి కొందరు స్టడీ సెంటర్ల నిర్వాహకులు డబ్బులు వసూలు చేస్తున్నారు. ఒక స్టడీ కేంద్రంలో టెన్త్ పరీక్షలకు రూ.10 వేలు, ఇంటర్‌లో ఆర్ట్‌కు రూ.12 వేలు, సైన్స్ కోర్సులకు రూ.15 వేల వరకూ వసూళ్లు చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. హాల్‌టికెట్ కోసం వెళ్లినప్పుడే సొమ్ములు తీసుకుంటున్నారని ఒక అభ్యర్థి వివరించారు. నగరంలో మరో స్టడీ కేంద్రంలో టెన్త్ అభ్యర్థుల నుంచి రూ.ఐదు వేల నుంచి ఏడు వేలు, ఇంటర్ అభ్యర్థుల నుంచి రూ.ఎనిమిది వేల నుంచి రూ.10 వేల వరకు వసూలు చేస్తున్నారు. అభ్యర్థుల్లో సగం కంటే ఎక్కువమంది సొమ్ములు ఇచ్చేందుకు ముందుకు వస్తున్నారని మధురవాడ ప్రాంతానికి చెందిన అభ్యర్థి ఒకరు తెలిపారు. ఇలా వసూలుచేసిన మొత్తంలో సార్వత్రిక విద్యాపీఠంలో కొందరు అధికారులు, సిబ్బంది, పరీక్షా కేంద్రాల్లో ఇన్విజిలేటర్లు, చీఫ్ సూపరింటెండెంట్లకు వాటాలు ఇవ్వాల్సి ఉంటుందని చెబుతున్నారని సదరు అభ్యర్థి వివరించారు. పరీక్షా కేంద్రాల్లో మాస్‌కాపీయింగ్‌కు పాల్పడే ... మిగతా 6వ పేజీలో

ఎన్నికల నిర్వహణకు సిద్ధంకండి

ఓటర్ల నమోదుపై డయల్ యువర్ కలెక్టర్‌కు 14 కాల్స్

..... వివరాలు Iలో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (గురు)	6.10
సహరి (శుక్ర)	4.50

20 మంది సీఐలకు చార్జిమెమోలు

- రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కారణం

విశాఖపట్నం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): నగరంలో 20 మంది సీఐలకు పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యన్నార్ చార్జిమెమోలు జారీచేశారు. ఒకేసారి 20 మందికి మెమోలు ఇవ్వడం పోలీస్ శాఖలో చర్చనీయాంశంగా మారింది. రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే కారణంతో మెమోలు ఇచ్చారు. శాంతిభద్రతల పర్యవేక్షణలో భాగంగా రౌడీషీటర్లకు ప్రతి ఆదివారం పోలీస్ స్టేషన్లలో కౌన్సెలింగ్ నిర్వహిస్తుంటారు. అయితే కొంతకాలంగా ఈ విషయంలో సీఐలు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. కౌన్సెలింగ్‌కు మొక్కుబడిగా హాజరై ఫొటో దిగి ఇంటికి వెళ్లిపోతున్నారు. కనీసం కౌన్సెలింగ్‌కు హాజరుకాని రౌడీషీటర్లను గుర్తించడం లేదు. దీనివల్ల రౌడీషీటర్లపై నిఘా కొరవడి హత్యలు, హత్యాయత్నాలు, దాడులు వంటివి పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతి ఆదివారం రౌడీషీటర్ల కౌన్సెలింగ్ పక్కాగా జరగాల్సిందేనని, సీఐలు స్వయంగా కౌన్సెలింగ్ చేయాలని జాయింట్ సీపీ ఫకీరప్ప ఆదేశాలు జారీచేశారు. కౌన్సెలింగ్‌కు హాజరుకాని వారిని స్టేషన్‌కు పిలిపించి హెచ్చరించాలని సూచించారు. అయినప్పటికీ నగరంలోని 20 మంది సీఐలు జాయింట్ సీపీ ఆదేశాలను పట్టించుకోలేదు. కొందరు కౌన్సెలింగ్‌కు హాజరుకాలేదు. మరికొందరు మొక్కుబడిగా వచ్చి ఇళ్లకు వెళ్లిపోయినట్టు సీపీ దృష్టికి చేరింది. దీంతో వారందరికి చార్జిమెమోలు జారీచేసినట్టు పోలీసులు పేర్కొంటున్నారు.

కాంగ్రెస్ సభ 16వ తేదీకి వాయిదా

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 13: ఉక్కు నగరంలోని తృష్ణా మైదానంలో ఈ నెల 15న నిర్వహించ తలపెట్టిన సభను 16వ తేదీకి వాయిదా వేసినట్టు కాంగ్రెస్ నాయకులు ప్రకటించారు. ఈ సభలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డితో పాటు ఏపీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, కేంద్ర మాజీ మంత్రులు పాల్గొననున్నారు. రేవంత్‌రెడ్డి, షర్మిల సహా నాయకులు కూర్మన్నపాలెంలోని ఉక్కు కార్మికుల నిరసన శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించనున్నారు.

సామాజిక న్యాయం టీడీపీతోనే సాధ్యం

» రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్


మాట్లాడుతున్న మహ్మద్ నజీర్

మహారాణిపేట, మార్చి 13: ముస్లింలకు రాజకీయ, ఆర్థిక, సామాజిక పరంగా అండగా నిలిచిన ఏకైక పార్టీ తెలుగుదేశం అని ఆపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్ అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముస్లిం మైనారిటీలను అన్ని విధాలుగా గౌరవించి ఉన్నత పదవులను తమ పార్టీ కల్పించినట్టు పేర్కొన్నారు. బషీరుద్దీన్ బాబూఖాన్‌ను తొలుత గుర్తించి మంత్రి పదవి ఇచ్చిన ఘనత తమ పార్టీదేనన్నారు. ఎంతోమంది తమ సామాజిక వర్గానికి చెందిన వారికి చంద్రబాబునాయుడు గుర్తించి అనేక పదవులు కల్పించి, సామాజిక న్యాయానికి మారు పేరుగా నిలిచారన్నా రు. ప్రస్తుత రాజకీయ సమీకరణాలలో విశాఖ దక్షిణ నియోజకవర్గ టికెట్ తనకు కేటాయించాలన్నారు. ఇప్ప టికే ఈమేరకు అధిష్ఠానానికి దరఖాస్తు చేసుకున్నానని, అవకాశం కల్పిస్తే పోటీ చేసి గెలుస్తానని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు.

కవయిత్రి మొల్ల గర్వించదగిన సాహితీవేత్త

మహారాణిపేట, మార్చి 13: కవయిత్రి మొల్ల దేశం గర్వించదగిన సాహితీవేత్త అని డీఆర్‌వో కె. మోహన్ కుమార్ అన్నారు. కవియిత్రి ఆతుకూరి మొల్ల జయంతిని బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. మొల్ల చిత్రపటానికి డీఆర్‌వో పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగులో తొలి కవియిత్రిగా మొల్ల రామాయణ కావ్యాన్ని రాసి అందరినీ విశేషంగా ఆకట్టుకున్నారన్నారు. ఈకార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి కె. శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వృద్ధుడు మృతి

మర్రిపాలెం, మార్చి 13: రోడ్డు ప్రమాదంలో గాయపడిన గుర్తు తెలియని వృద్ధుడు చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మృతి చెందినట్టు ఎయిర్‌పోర్ట్ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. గత నెల 2వతేదీన ఎన్‌ఏడీ జంక్షన్ నుంచి మర్రిపాలెంవైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఈ వృద్ధునికి తీవ్రగాయాలు కాగా, అతడిని చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. బుధవారం వీఆర్వో సాయిభారతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు ఫోన్: 8331041645 సమాచారమివ్వాలని ఎస్‌ఐ కోరారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు లైన్ క్లియర్

డాబాగార్డెన్స్, మార్చి 13: రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలకు సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారం నిధులు కేటాయిస్తూ ఆర్థిక శాఖ ఒక రెండు రోజుల్లో జీవో జారీ చేయనుందని ఐ అండ్ పీఆర్‌రాష్ట్ర కమిషనర్ విజయ్‌కుమార్ రెడ్డి విశాఖ అక్రిడేటెడ్ వర్కింగ్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధి బృందానికి తెలిపారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల ప్రక్రియను వేగవంతం చేయాలనికోరుతూ విశాఖ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు బి.రవికాంత్, ఆర్గనైజింగ్ కార్యదర్శి పీఏ రావు బుధవారం ఆయనకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఎన్నికల కోడ్‌తో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల ప్రక్రియకు సంబంధం లేదని ఆయన తెలిపారు. స్థలాల కేటాయింపు ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్లు, అధికారులకు సీఎం జగన్ ఆదేశాలు జారీ చేశారని వెల్లడించారు. ఈ మేరకు నిధులు కేటాయింపు చేస్తూ ఆర్థిక శాఖ నుంచి ఆదేశాలిచ్చినట్టు చెప్పారు.


పార్కులో తుప్పు పట్టిన జారుడు బల్ల


పార్కులో ఉతికిన బట్టలు ఆరబెట్టిన దృశ్యం

పార్కు ఇలా.. సేదతీరేదెలా?

» నిరుపయోగంగా తాటిచెట్లపాలెం తారకరామనగర్ పార్కు » తుప్పు పట్టిన క్రీడా పరికరాలు » పట్టించుకోని జీవీఎంసీ

అక్కయ్యపాలెం, మార్చి 13: గ్రేటర్ 45వ వార్డు పరిధి తాటిచెట్లపాలెం తారకరామనగర్‌లోని పార్కు శిథిలావస్థకు చేరుకుని నిరుపయోగంగా మారింది. పార్కు ప్రారంభించిన తొలుతలో పిల్లలు, పెద్దలు ఉదయం, సాయంత్రం సేద తీరేవారు. పార్కులో వివిధ ఆట వస్తువులుండడంతో పిల్లలు ఆడుకునేవారు. రోజులు గడచిన కొద్దీ ఆట వస్తువులన్నీ పాడైపోయి తుప్పు పట్టడంతో పిల్లలు ఆటలకు దూరమయ్యారు. పార్కు దుస్థితి చూసి పెద్దలు కూడా రావడం మానేశారు. దీంతో ప్రస్తుతం నిరుపయోగంగా దర్శనమిస్తోంది. గతంలో విశాఖలోని అన్ని పార్కులను పునరుద్ధరించినా, దీనిని మాత్రం పట్టించుకోకుండా వదిలేశారు. ఫలితంగా స్థానికులు క్రీడా సామగ్రిపై ఉతికిన బట్టలు ఆరబెట్టుకుంటున్నారు. 2017లో ఇక్కడున్న ఖాళీ స్థలంలో పిల్లల కోసం ఈ పార్కును ఏర్పాటు చేశారు. చిన్నారులు ఆడుకునేందుకు వీలుగా జారుడు బల్ల, ఊయల వివిధ రకాల సామగ్రిని ఏర్పాటు చేశారు. మొదట్లో నిర్వహణ ఉండడంతో ఏడాది వరకు సవ్యంగా నడిచింది. క్రమేపీ వాచ్‌మెన్ లేకపోవడం, జీవీఎంసీ అధికారులు గానీ, స్థానికులుగానీ పార్కు నిర్వహణ పట్టించుకోకపోవడంతో పార్కులో ఉన్న ఆట వస్తువులు ఒక్కొక్కటీ మూలకు చేరుకున్నాయి. ప్రహరీ శిథిలమైంది. ప్రధాన ద్వారం కూడా పాడైపోయింది. ఆట వస్తువులను కొం తమంది ఎత్తుకు వెళ్లగా, మిగిలినవి మూలకు చేరాయి. ఇదే అదనుగా స్థానికులు పార్కులో చెత్త వేస్తున్నారు. పరిసర ప్రాంతాల్లో భవన నిర్మాణాల వ్యర్థాలు, డెబ్రిస్‌ను వేస్తూ డంపింగ్‌యార్డుగా మార్చేస్తున్నారు.

కల్యాణ మండపంగా మార్చాలని వినతులు

చాలామేరకు మురికివాడలున్న ఈ ప్రాంతంలో నిరుపేద, దిగువ మధ్యతరగతి కుటుంబాలే నివాసముంటున్నాయి. ఈస్థితిలో ఏ శుభ కా ర్యం చేసుకోవాలన్నా రోడ్డుపై టెంట్లు వేసుకుని కొనసాగిస్తున్నారు. ఒక వేళ పెళ్లిళ్ల వంటి పెద్ద కార్యక్రమాలైతే ఇతర ప్రాంతాల్లోని కల్యాణమండపాలకు వెళ్లాల్సి వస్తోందని స్థానికులు చెబుతున్నారు. అధిక మొత్తంలో అద్దెలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నా రు. ఈ పార్కును పునరుద్ధరించే పరిస్థితి లేనందున కల్యాణమండపం నిర్మిస్తే ప్రజోపయోగకరంగా ఉంటుందని స్థానికులు కోరుతున్నారు.

ఎన్నికల్లో పోటీ చేయను.. ప్రచారం చేస్తా..

» మాజీ మంత్రి, సినీ నటుడు బాబూమోహన్


మాట్లాడుతున్న బాబూమోహన్

అక్కయ్యపాలెం, మార్చి 13: ఈసారి ఎన్నికల్లో తాను పోటీ చేయడం లేదని ప్రజా శాంతి పార్టీ జాతీయ కోర్ కమిటీ సభ్యుడు బాబూమోహన్ ప్రకటించారు. విశాఖపట్నం వచ్చిన ఆయన దొండపర్తిలోని కేఏ పాల్ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. బీజేపీ చేసిన మోసం వల్ల ఆ పార్టీకి రాజీనామా చేశానని, ప్రజాశాంతి పార్టీలో చేరానని వివరించారు. కాకినాడ లేదా గాజువాక నియోజకవర్గాల నుంచి పార్టీ తరఫున పోటీ చేయాలని కేఏ పాల్ కోరారని, అయితే తాను తిరస్కరించానన్నారు. ఈ ఎన్నికల్లో కేఏ పాల్ పార్టీ తరఫున ప్రచారం చేస్తానని చెప్పారు. విశాఖ ఎంపీగా కేఏ పాల్‌ను గెలిపించాలని కోరారు. ఆయన సమస్యలు పరిష్కరిస్తారన్నారు.

51 మందికి పీఎం స్వరాజ్ రుణాల పంపిణీ


రుణాలను అందిస్తున్న జేసీ మయూర అశోక్

మహారాణిపేట, మార్చి 13: ప్రధాన మంత్రి స్వరాజ్ పథకం కింద జిల్లా వ్యాప్తంగా 51 మందికి రూ.2,17 కోట్ల రుణాలను జాయింట్ కలెక్టర్ కె.మయూర అశోక్ బుధవారం పంపిణీ చేశారు. మరో 31 మందికి ఆయుష్మాన్ కార్డులు, 32 మంది లబ్ధిదారులకు పీపీఈ కిట్లను అందజేశారు. సామాజిక న్యాయం సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ పథకాన్ని ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. కార్యక్రమంలో పలువురు అధికారులుపాల్గొన్నారు.

నేడు ఏయూలో నాక్ సర్టిఫికెట్లు ప్రదానం

విశాఖపట్నం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని గురువారం నాక్ సర్టిఫికెట్లను ప్రదానం చేయ నున్నారు. బీచ్ రోడ్డులోని కన్వెన్షన్ హాల్‌లో మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహించనున్న కార్యక్రమంలో శ్రీనివాసరావు పేరుతో పరిశోధకులు, నాన్ టీచింగ్, టీచింగ్ స్టాఫ్, ఇతర అధికారులు, సిబ్బందికి సమాచారాన్ని అందించారు. సాధారణంగా ఈ తరహా సమాచారం రిజిస్ట్రార్ పేరుతో వస్తుంది. కానీ, శ్రీనివాసరావు పేరుతో హోదా, ఇతర వివరాలు లేకుండా సమాచారం ఇవ్వడంతో దానిపై వర్సిటీలో చర్చ జరుగుతోంది.

రంజాన్ నేపథ్యంలో రేషన్ పంపిణీ


సమావేశంలో మాట్లాడుతున్న గండి బాబ్జీ

జగదాంబ కూడలి, మార్చి 13: గ్రేటర్ 39వ వార్డు కోటవీధి ప్రాంతంలో ముస్లింతదితర కుటుంబాలకు టీడీపీ నాయకుడు గఫూర్ రంజాన్ పురస్కరించుకుని రేషన్ కిట్లను పంపిణీ చేశారు. బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆ పార్టీ ఇన్‌చార్జి గండి బాబ్జీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గఫూర్ 1999నుంచి నేటికి 25 ఏళ్లగా పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా అందించడం గొప్పవిషమన్నారు. ముస్లింలకు అన్నివిధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. గఫూర్ మాట్లాడుతూ కోటవీధి పరిసర ప్రాంతాల్లో పేద కుటుంబాలు కనీస వసతులు లేక దుర్భర స్థితిలో జీవనం సాగిస్తున్నాయన్నారు. పరిసరాలు పారిశుధ్య లోపంతో ఇబ్బంది ఎదుర్కొంటున్నారన్నారు. కరెంట్, మంచినీటి కష్టాలు తప్పడం లేదని వాపోయారు. పోర్టు కాలుష్యంతో రోగాల బారిన పడుతున్నారన్నారు.వీరికి జీవీఎంసీ అధికారులుకనీసవసతులు కల్పించాలన్నారు.మతాలకతీతంగా అందరికీ రంజాన్ మాసంలో నిత్యావసరాలు అందజేసినట్లు తెలిపారు. ముస్లిం మత పెద్దలు, టీడీపీ నాయకులున్నారు.

బాధితులకు ఆర్థికసాయం పంపిణీ

సీతమ్మధార, మార్చి 13: సీతమ్మధారలోని వైసీపీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన ఉత్తర నియోజక వర్గ సమన్వయకర్త కేకే రాజు 22 మందికి రూ.22.27 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. కార్పొరేటర్లు అనిల్‌కుమార్ రాజు, సారిపిల్లి గోవింద్ పి.ఉషశ్రీ, శశికళ పాల్గొన్నారు.

జ్ఞానాపురం: జీవీఎంసీ 41వ వార్డు హోలీ క్రాస్ స్ట్రీట్‌కు చెందిన బాలింత రీనా ఎముక వ్యాధితో బాధపడుతుండడంతో మెరుగైన వైద్యం కోసం సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ. 3 లక్షలు విడుదలైంది. ఈ చెక్కును ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్ బుధవారం బాధితురాలి కుటుంబానికి అందించారు.

ఉడా కాలనీలో యథేచ్ఛగా పశువుల సంచారం


కాలనీ రోడ్లపై పశువులు

మాధవధార, మార్చి 12 ; గ్రేటర్ 51వ వార్డు మాధవధార ఉడాకాలనీ, పరిసర ప్రాంతాల్లో పశువుల స్వైర విహారంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పగలూ, రాత్రి తేడాలేకుండా సమీప మురికివాడల్లోని పశువులను కాపరులు కాలనీలో విడిచి పెట్టి పోతున్నారు. 48ఏ బస్ రూట్‌లో బస్సులు, భారీ వాహనాలు, ఇతర వాహనదారులకు ఇవి అడ్డుపడి ప్రమాదకరంగా మారుతున్నాయి. మరోవైపు కాలనీలో పచ్చదనం హరించుకుపోతోంది. ఇళ్ల ఆవరణలో ఉన్న పూల మొక్కలు, చిన్నపాటి గార్డెన్ పెంపకాలను పశువులు ధ్వంసం చేస్తున్నాయి. పదుల సంఖ్యలో పశువుల గుంపుతో కాలనీలో సమస్యగా తయారైంది. రాత్రి వేళల్లో రోడ్లకు అడ్డంగా నిద్రిస్తున్న గేదెలు వాహనాలు అతి సమీపంగా వచ్చే వరకు గుర్తించడం కష్టంగా మారి వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. పశువుల సంచారాన్ని నియంత్రించాలని మాధవధార ఉడాకాలనీ, ఆర్టీఓ కార్యాలయ పరిసర ప్రాంతాల నివాసితులు కోరుతున్నారు.

'బాగా చదువుకుని ఉద్యోగాలు పొందాలి'


క్విజ్ పోటీ విజేతులతో గ్రంథాలయ సొసైటీ కార్యదర్శి సూర్యారావు

సీతంపేట, మార్చి 13: ఉన్నత లక్ష్య సాధనతో విద్యార్థులు బాగా చదివి మంచి కొలువులు పొందాలని గ్రంథాలయ సొసైటీ సహ కార్యదర్శి డాక్టర్ డీవీ సూర్యారావు పేర్కొన్నారు. విశాఖ పౌరగ్రంథాలయంలో ఉద్యోగార్థులకు వివిధ పోటీ పరీక్షల పాఠ్యాంశాలతో క్విజ్ పోటీలను నిర్వహించారు. వర్తమాన అంశాలతో పాటు గ్రూప్- 2 మెయిన్స్ సిలబస్ ఆధారంగా వివిధ శాస్త్రాలపై క్విజ్ పోటీ నిర్వహించారు. ఈ పోటీల్లో గ్రంథాలయంలో చదువుతున్న, వివిధ కళాశాల విద్యార్థులు 60 మంది బృందాలుగా పాల్గొన్నారు. గెలుపొందిన విద్యార్థులకు పుస్తకాలు బహూకరించారు. గ్రాంథపాలకులు దుర్గారాణి పర్యవేక్షణలో నిర్వహించారు.

నిషేధిత యాంటీబయోటిక్స్‌పై అవగాహన


సమావేశంలో పాల్గొన్న సంస్థ ప్రతినిధులు

అల్లిపురం, మార్చి 13: కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎక్స్‌పోర్ట్ ఇన్స్‌పెక్షన్ కౌన్సిల్, ఎక్స్‌పోర్ట్ ఇన్స్‌పెక్షన్ ఏజెన్సీ చెన్నై, విశాఖ కేంద్ర సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. విశాఖ, కాకినాడ ప్రాంతాల్లోని వివిధ ఆమోదిత సీఫుడ్ సంస్థల సాంకేతిక నిపుణులకు ఎల్సా టెక్నిక్ ద్వారా యాంటీబయోటిక్స్ స్క్రీనింగ్, నిషేధిత యాంటీబయోటిక్స్‌పై రెండురోజులపాటు శిక్షణ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారికి అసిస్టెంట్ డైరెక్టరు ఎస్.శేఖర్ దాస్, డిప్యూటీ డైరెక్టర్ జి జయపాలన్ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కుమార్, చిన్ని రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టికెట్ టెన్షన్!

... 5వ పేజీ తరువాయి

జిల్లా చీపురుపల్లి నుంచి పోటీ చేయాల్సిందిగా చంద్రబాబునాయుడు సూచించారు. ఈ నేపథ్యంలో తన వియ్యంకుడు పి.నారాయణతో కలిసి గంటా బుధవారం ఉదయం చంద్రబాబునాయుడును కలిశారు. దీంతో భీమిలి నుంచి ఎవరు బరిలో దిగుతారోనన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. 'సౌత్' సీటును జనసేనకు కేటాయించిన నేపథ్యంలో తగిన న్యాయం చేస్తామని అక్కడ ఇన్‌చార్జి గండి బాబ్జీకి అధినేత భరోసా ఇచ్చారు.

ఇక జనసేనకు కేటాయించిన విశాఖ దక్షిణ నియోజకవర్గం నుంచి చెల్లుబోయిన వంశీకృష్ణ శ్రీనివాసయాదవ్, పెందుర్తి నుంచి పంచకర్ల రమేష్‌బాబు, బీజేపీకి ఇచ్చిన విశాఖ ఉత్తరం నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు పేర్లు దాదాపు ఖరారైనట్టు చెబుతున్నారు.

పార్లమెంటు బరిలో ఎం.శ్రీభరత్?

విశాఖ లోక్‌సభ స్థానానికి టీడీపీ తరఫున ఎం.శ్రీభరత్ పేరు దాదాపు ఖరారైంది. పొత్తులో భాగంగా బీజేపీ విశాఖ లోక్‌సభ సీటు తమకు కేటాయించాలని కోరింది. అయితే అందుకు చంద్రబాబునాయుడు అంగీకరించలేదు. ఈ నేపథ్యంలో శ్రీభరత్ పేరు ప్రకటన లాంఛనమేనని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. గురువారం ప్రకటించే జాబితాలో ఆయన పేరు ఉండే అవకాశం ఉంది.

ఓపెన్ స్కూల్ పరీక్షలకు వసూళ్లు!?

... 5వ పేజీ తరువాయి

వ్యవహారంలో ఆనందపురం మండలంలో ఒక ఉన్నత పాఠశాల టీచర్ కీలక పాత్ర పోషిస్తారన్న ఆరోపణలున్నాయి. ఓపెన్ స్కూళ్ల ద్వారా పరీక్షలు రాసే అభ్యర్థుల నుంచి సొమ్ముల వసూళ్ల వ్యవహారంపై డీఈవో ఎల్.చంద్రకళ వద్ద ప్రస్తావించగా పరీక్షల నిర్వహణలో ఎటువంటి అవకతవకలకు పాల్పడకుండా చర్యలు తీసుకుంటామన్నారు. పరీక్షలు పక్కాగా జరిగేందుకు ప్రతి కేంద్రానికి సిట్టింగ్ స్క్వాడ్‌లు నియమిస్తామన్నారు. ఎవరికీ అభ్యర్థులు సొమ్ములు ఇవ్వొద్దని కోరారు. ఇంకా ఎవరైనా ఇవ్వాలని ఒత్తిడి తీసుకువస్తే తమకు ఫిర్యాదు చేయాలన్నారు.

ఆశావహుల్లో ఉత్కంఠ

... 5వ పేజీ తరువాయి

తెలిసింది. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు రాజ్యసభ సభ్యుడు సీఎం రమేశ్ పేరు దాదాపు ఖరారైంది. తొలుత టీడీపీ, జనసేన పొత్తుల నేపథ్యంలో అనకాపల్లి ఎంపీ స్థానాన్ని జనసేనకు కేటాయిస్తారని, పవన్‌కల్యాణ్ సోదరుడు నాగబాబు పోటీ చేస్తారని ప్రచారం జరిగింది. కూటమిలో బీజేపీ కూడా చేరడంతో ఇప్పుడు అనకాపల్లి పార్లమెంట్ స్థానాన్ని బీజేపీకి కేటాయించారు. సామాజిక సమీకరణల్లో భాగంగా కడప జిల్లాకు చెందిన సీఎం రమేశ్ పేరును అధిష్ఠానం పరిశీలిస్తున్నట్టు సమాచారం. ఆయన అభ్యర్థిత్వాన్ని ఒకటి, రెండు రోజుల్లో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని చెబుతున్నారు. సీఎం రమేశ్‌తోపాటు బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, మహిళా మోర్చా నాయకురాలు తోట విజయలక్ష్మి పేర్లను కూడా పార్టీ అధిష్ఠానం పరిశీలిస్తున్నట్టు సమాచారం.

రోడ్డునపడ్డ మానసిక దివ్యాంగులు

... 5వ పేజీ తరువాయి

దివ్యాంగుల పాఠశాల నడుస్తోంది. ఇక్కడ 200 మందికి సరిపడా వసతి లేకపోవడంతో పిల్లలకు వంటా వార్పు, భోజనాలు రోడ్డుపైనే నిర్వహించాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. అంతేకాదు పిల్లలకు పలు అంశాల్లో శిక్షణ ఇచ్చే అవకాశం కూడా లేకుండాపోయింది.

అధికారులు స్పందించాలి

- కండిపిల్లి శ్రీనివాసరావు, 'హిడెన్ స్ప్రౌట్స్' పాఠశాల నిర్వాహకుడు

పాఠశాలను ఖాళీ చేయించడంతో జీవీఎంసీ స్థలంలోనే మూడు బస్సులు, ఆరు కంప్యూటర్లు, మూడు జెరాక్స్ మిషన్లు, ప్రింటర్, ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, బుక్ బైండింగ్ యూనిట్, వ్యాయామ సామగ్రి, విద్యుత్ వస్తువులు ఉండిపోయాయి. మూడేళ్లుగా ఉపయోగించకపోవడం, నిర్వహణ లేక పాడైపోతున్నాయి. అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా ఫలితం కనిపించడం లేదు. పాఠశాలను తొలగించిన స్థలాన్ని చూస్తే కళ్లలో నీరు తిరుగుతోంది. ప్రస్తుతం అది అడవిని తలపిస్తోంది. ఆ స్థలంలో ఇప్పటివరకూ ఎలాంటి పనులు చేపట్టలేదు. అధికారులు స్పందించి దివ్యాంగులను ఆదుకోవాలి.

విద్యార్థినులకు కెరియర్ గ్రోత్‌పై శిక్షణ


విద్యార్థినులకు సర్టిఫికెట్స్ ప్రదానం

డాబాగార్డెన్స్, మార్చి 13: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో డిగ్రీ విద్యార్థినులకు మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సాఫ్ట్ కమ్యూనికేషన్ స్కిల్స్, కెరీయర్ గ్రోత్ పై ట్రైనింగ్ ప్రోగ్రామ్ పూర్తయినట్టు కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి తెలిపారు. ఈ ఏడురోజుల పాటు నిర్వహించిన ఈశిక్షణలో పరిశ్రమలకు అవసరమైన వివిధ నైపుణ్యాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించినట్టు చెప్పారు. మంచి ప్లేస్‌మెంట్స్ సాధించేందుకు శిక్షణ దోహదం చేస్తుందన్నారు. శిక్షణలో పాల్గొన వారికి సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డి.అరుణపద్మ, కె. అనూష, డి.ప్రజ్ఞ పాల్గొన్నారు.

రామాయణం భారతీయ సంస్కృతికి మూలం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రముఖ సాహితివేత్త టీపీఎన్ ఆచార్యులు

సీతమ్మధార, మార్చి 13: వేదాల సారాన్ని రామాయణ మహాకావ్యంగా రచించి భారతీయ సంస్కృతికి వాల్మీకి మూలస్తంభంగా నిలిచారని సహృదయ సాహితి సంస్థ వ్యవస్థాపకులు శేఖరమంత్రి ప్రభాకర్ అన్నారు. సీతంపేట రాజేంద్రనగర్‌లోని ప్రిజమ్ కళాశాలలో సహృదయ సంస్థ ఆధ్వర్యంలో రామాయణంలో రసరమ్య ఘట్టాలు అనే అంశంపై నిర్వహించిన ప్రసంగ కార్యక్రమం ఆహూతులను ఆకట్టుకుంది. సభకు అధ్యక్షత వహించిన ప్రభాకర్ మాట్లాడుతూ రామాయణం మానవ జీవితాలకు సుసంపన్నం చేసే మహాకావ్యమన్నారు. ప్రధాన వక్తగా విచ్చేసిన ప్ర ముఖ సాహితీవేత్త టీపీఎన్ ఆచార్యులు రామాయణంలో పలు ఘట్టాలను వివరించారు. రామ నామమహిమ, పుంజకస్థల వృత్తాంతం, అష్టాక్షరి, పంచాక్షరిలోని పలు విషయాలు వివరించారు. అలాగే రావణ కాష్ఠం, సీతాదేవి జన్మవృత్తాంతం తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయనిర్మాణ్ అధినేత డాక్టర్ సూరపనేని విజయకుమార్, విశ్లేషకులు డాక్టర్ డీవీ సూర్యారావు, చిన సూర్యనారాయణ, భాగవతుల సత్యనారాయణ మూర్తి, అయ్యల సోమయాజుల ప్రసాద్ పాల్గొన్నారు.

విజన్ విశాఖ ధ్యేయం : వైవీ


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న వైవీ సుబ్బారెడ్డి, మేయర్ తదితరులు

సిరిపురం, మార్చి 13 : విజన్ విశాఖే ధ్యేయంగా నగరాన్ని అంతర్జాతీయస్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని వైసీపీ ఉత్తరాంధ్ర జిల్లాల కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2019కి ముందు తరువాత విశాఖ అభివృద్ధిని గ్రహించాలన్నారు. అంతకు ముందు జీవీఎంసీ పరిధిలో సుమారు రూ.147 కోట్లతో చేపట్టనున్న 423 అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారి, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, కేకే రాజు, డిప్యూటీ మేయర్లు శ్రీధర్, సతీష్, కమిషనర్ సాయికాంత్ వర్మ ఉన్నారు.

చెదురుతున్న జ్ఞాపకం

» దుమ్ము, ధూళి మధ్య వన్‌టౌన్‌లోని విక్టోరియా విగ్రహం

» పట్టించుకోని పాలనా యంత్రాంగం

జగదాంబ కూడలి, మార్చి 13: విశాఖ చరిత్రకు ఆనవాళ్లుగా నిలిచే వన్‌టౌన్‌లోని విక్టోరియా రాణి స్థూపం దుమ్ము, ధూళి, బీటలు వారిన గోడలతో కళావిహీనంగా మారింది. విక్టోరియా రాణి కాంస్య విగ్రహం పోర్టు కాలుష్యంతో మసకమారితోంది. వన్‌టౌన్‌లో 120 ఏళ్ల చరిత్ర గలిగిన ఈ స్మారక స్థూపం పరిసరాలు పూర్తిగా చెత్తా చెదారాలతో నిండిఉంటున్నాయి. కొన్నేళ్ల కిందటి వరకు ఈ స్థూపం ప్రత్యేక ఆకర్షణగా ఉండేది. పోర్టు వెంకటేశ్వర గుడి, పోర్టు పరిసరాలు తిలకించేందుకు వచ్చే వారు విక్టోరియా విగ్రహాన్ని చూసేందుకు వచ్చేవారు.. స్థూపం చరిత్ర తెలుసుకునేందుకు ఆసక్తి చూపేవారు. ప్రస్తుతం విక్టోరియారాణి విగ్రహం స్థూపం ఆలనాపాలనా లేనిదిగా మారింది. దీంతో బ్రిటీషు కాలం నాటి చరిత్ర పూర్తిగా కనుమరుగవుతుందన్న ఆవేదన సందర్శకుల్లో వ్యక్తమవుతోంది. గతంలో పాలకులు కొంత మేర్కైనా దీని సంరక్షణపై దృష్టి పెట్టడంతో ఎంతో ఆహ్లాదంగా కనిపించేది.గత పదేళ్లనుంచి ఎవరూ పట్టించుకోవడంలేదు. జీవీఎంసీ దృష్టిసారించి పూర్వవైభవం తీసుకురావాలని నగర వాసులు కోరుతున్నారు.


శిథిలావస్థలో విక్టోరియ రాణి విగ్రహం


ఆవరణలో చెత్తాచెదారాలు



నిరసన తెలుపుతున్న విదసం నేతలు, తదితరులు

'విదసం' ఆధ్వర్యంలో నిరసన

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 13: మతంలో కూడిన సిటిజన్‌షిప్ చట్టాన్ని నిలిపివేయాలంటూ విదసం ఐక్య వేదిక రాష్ట్ర సమన్వయకర్త బూసి వెంకటరావు డిమాండ్ చేశారు. 2019 పౌరసత్వ చటానిఖ్న తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం స్టీల్‌ప్లాంట్ గాంధీ పార్కు వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌరసత్వం మత ప్రాతిపదికన ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ప్రజలను మతాలవారీగా విడగొట్టి ప్రజల్లో విద్వేషాలు రెచ్చగొట్టవదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బూల భాస్కరరావు, బి.పరమేశ్వరి, అప్పలరెడ్డి, రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన మంత్రి అమర్‌నాథ్

గాజువాక, మార్చి 13: ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి నివాసంలో బుధవారం రాత్రి మంత్రి, వైసీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త గుడివాడ అమర్‌నాథ్ సమావేశమయ్యారు. నాగిరెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, నాగిరెడ్డి కుమారులు దేవన్‌రెడ్డి, వంశీరెడ్డిలతో సుమారు గంటసేపు ఎన్నికల్లో విజయావకాశాలపై చర్చించారు. తన విజయానికి సహకారాన్ని అందించాలని నాగిరెడ్డిని అమర్‌నాథ్ కోరారు.

'చికిత్సతో కిడ్నీ సమస్యలు పరిష్కారం'

అక్కిరెడ్డిపాలెం, మార్చి 13: కిడ్నీ సంబంధిత సమస్యలను సకాలంలో గుర్తించి మందులు వాడడంతో పాటు జీవనశైలిలో మార్పులు చేసుకుంటే కిడ్నీ మార్పిడి లేకుండా సమస్యలను పరిష్కరించుకోవచ్చని ప్రముఖ నెఫ్రాలజిస్టు డాక్టర్ ఆర్కే మహేశ్ అన్నారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో బుధవారం కిడ్నీ సమస్యలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు ఒకే రక్తం గ్రూపు ఉన్నవారి నుంచి మాత్రమే అవయవ దానం జరిగేదని, కానీ ఇప్పుడు వేరే గ్రూపు బ్లడ్‌తో రోగికి కొన్ని మందులిచ్చి కిడ్నీ మార్పిడి చేయవచ్చన్నారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, స్థానికులు పాల్గొన్నారు.

వడ్లపూడిలో బ్రహ్మసూత్ర శివాలయం ఏర్పాటుకు సన్నాహాలు

కూర్మన్నపాలెం, మార్చి 13: ఉత్తరాంధ్రలో తొలిసారిగా 87వ వార్డు పరిధి వడ్లపూడిలో బ్రహ్మసూత్ర శివాలయం ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు కార్పొరేటర్ బొండా జగన్ పేర్కొన్నారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో పలువురు ఆలయ ప్రారంభోత్సవ ర్యాలీ చేపట్టారు. ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు పంచముఖ వినాయక ఆలయం, షిర్డీ సాయిబాబా, శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, సీతారామాంజనేయస్వామి, నవగ్రహ మండపం, నూతన ధ్వజ స్తంభం, నాగబంధం, శిఖర ప్రతిష్ఠతో ఆలయ ప్రారంభోత్సవాలను నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. అలాగే 17వ తేదీ మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమాన్ని చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు రమణమ్మ, అరుణ, లక్ష్మి, రాము, గోవింద్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు సత్తెమ్మతల్లి జాతర

వేపగుంట మార్చి 13: జీవీఎంసీ 93వ వార్డు పరిధి శ్రీనివాసనగర్‌లోని సింహాద్రి అప్పన్న సోదరి సత్తెమ్మ తల్లి ఆలయ జాతర మహోత్సవం గురువారం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఏటా మార్చి 14న అమ్మవారి పుట్టిన రోజు పురస్కరించుకు ఈ ఉత్సవం నిర్వహిస్తారు. భక్తులకు అసౌకర్యం లేకుండా క్యూలు, ఉచిత మంచినీటి పంపిణీకి ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన ఉంటుంది. సాయంత్రం వివిధ సాంస్కృతి కార్య క్రమాలు ఏర్పాటు చేశారు.

సినిమా గైడ్

- **భీమా** : మెలోడి, సంగం, శ్రీరామ, శారద, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక), నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్-2 (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), రాములమ్మ (తగరపువలస)
- **గామి** : జగదాంబ, శరత్, కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), గణేష్ (తగరపువలస), నటరాజ్ (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం),
- **ప్రేమలు** : శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మి (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఇంటి నెం.13** : రమాదేవి, మోహిని (గాజువాక)
- **ఆపరేషన్ వాలెంటైన్** : రమాదేవి, మౌర్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజవాక)
- **ఊరు పేరు భైరవకోన** : వెంకటేశ్వర, కామేశ్వరి, కన్య-2 (గాజువాక)
- **హనుమాన్** : లీలామహల్, నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 24,టమాటా 17, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 32, బెండకాయలు 24, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 40, బీరకాయలు 34, ఆనపకాయలు 14, కాలీఫ్లవర్ 24, క్యాబేజ్ 22, క్యారెట్ 25, దొండకాయలు 22, బంగాళదుంపలు 21, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 46, అల్లం (పాతది) 125, బరబాటి 16, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 32, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 150, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 52, ఆగాకర 52, పొటల్స్ 62, కీరదోస 28, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 54, చిలగడదుంపలు 26 , కంద 60, దేముడు చిక్కుడు 56, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 55, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	450
విజయనగరం	454
శ్రీకాకుళం	454

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	95
ఫారం ధర	--	115
విత్ స్కిన్	--	200
స్కిన్‌లెస్	--	210

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

సూపర్ సిక్స్ పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేస్తాం

టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

పెదగంట్యాడ, మార్చి 13: రానున్న ఎన్నికల్లో విజయం సాధించి తెలుగుదేశం పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం తథ్యమని, సూపర్ సిక్స్ పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేస్తామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. 76వ వార్డు పరిధి రామచంద్రానగర్‌లో, 64వ వార్డు కొత్త దిబ్బపాలెంలో బుధవారం ఆయన సూపర్ సిక్స్ పథకాల గురించి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీల కూటమి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఏర్పడిందన్నారు. వైసీపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల రాష్ట్రం సర్వనాశనమయిందన్నారు. జనరంజక పాలనలో అపార అనుభవం కలిగిన చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావడం చారిత్రక అవసరమన్నారు. జీవీఎంసీ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు బొసెట్టి అప్పారావు, తాటికొండ సుదర్శనరావు, కొవిరి హరికృష్ణ, కదిరి పోలరాజు, పి.ఉగ్రం, కె.వెంకటరావు, కె.సత్యారావు, ఎం.నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.



సూపర్ సిక్స్ బ్రోచర్లను పంపిణీ చేస్తున్న పల్లా శ్రీనివాసరావు, తదితరులు

తృష్ణా మైదానాన్ని పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 13: ఈ నెల 16న ఉక్కు తృష్ణా మైదానంలో జరగనున్న కాంగ్రెస్ పార్టీ స్టీల్‌ప్లాంట్ డిక్లరేషన్ బహిరంగ సభకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరవుతున్న నేపథ్యంలో బుధవారం ఆ పార్టీ నాయకులు సభా ప్రాంగణాన్ని పరిశీలించారు. ఉక్కు ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులతో పాటు అధిక సంఖ్యలో ప్రజలు ప్రజలు హాజరవుతారని భావిస్తూ పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం పక్క రాష్ట్రానికి చెందిన ముఖ్యమంత్రి బహిరంగ సభకు వస్తున్నందున ప్రజలు భారీగా స్థాయిలో తరలివస్తారని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. మైదానాన్ని పరిశీలించిన వారిలో సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు, పార్టీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి పి.రాకేశ్‌రెడ్డి, అధికార ప్రతినిధి జెర్రిపోతుల ముత్యాలు, నాయకులు శ్రీను, భూలోక, వర్మ, రాజుబాబు, తదితరులు ఉన్నారు.



మైదానాన్ని పరిశీలిస్తున్న గిడుగు రుద్రరాజు, తదితరులు

ఉక్కును కాపుడుకోవడం తెలుగువారి బాధ్యత

అక్కిరెడ్డిపాలెం: ఎంతోమంది ప్రాణ త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ కాకుండా చూడాల్సిన బాధ్యత తెలుగు వారందరిపై ఉందని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు గిడుగు రుద్రరాజు అన్నారు. బెల్ హెచ్‌పీవీపీలో బుధవారం రాత్రి జరిగిన ఇంటక్ జిల్లా ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ నెల 16న జరగనున్న కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభను విజయవంతం చేయడంతో పాటు డిక్లరేషన్ అమలుకు కారికులందరితో పాటు ప్రజలంతా మద్దతు పలకాలని కోరారు. ఈ సమావేశంలో పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పి.రాకేశ్‌రెడ్డి, నాయకులు మంత్రి రాజశేఖర్, కొయ్య ప్రసాద్‌రెడ్డి, గొంప గోవింద్, ఉరుకూటి బాబూరావు, నీరుకొండ రామచంద్రరావు, జి.వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సభను విజయవంతం చేయాలి: సీపీఐ నేత పైడిరాజు

పెదగంట్యాడ: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ తరపున డిక్లరేషన్ ప్రకటించేందుకు ఈ నెల 16న తృష్ణా మైదానంలో జరగనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు కోరారు. స్థానిక పోతిన సన్యాసిరావు భవన్‌లో బుధవారం నిర్వహించిన సీపీఐ గాజువాక సమితి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సభకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతారని,ఆయన సమక్షంలోనే స్టీల్‌ప్లాంట్ డిక్లరేషన్‌ను ప్రకటించడం జరుగుతుందన్నారు. ఇండియా కూటమి ఆధ్వర్యంలో కాంగ్రెస్, వామపక్షాలు స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం పోరాడుతున్నాయన్నారు. ఈ సభకు పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావులు హాజరవుతారన్నారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు కె.సత్యనారాయణ, జె.రామకృష్ణ, జి.ఆనంద్, అచ్యుతరావు, ఎ.విష్ణుమూర్తి, పి.దుర్గారావు, మహిళా సమాఖ్య నేతలు కె.వనజాక్షి, పిల్లా పద్మ, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి నోచుకోని శ్మశానవాటిక

కనీస వసతులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న ప్రజలు

పెదగంట్యాడ, మార్చి 13: మండల కేంద్రంలోని శ్మశానవాటిక అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. ఎన్నో ఏళ్లుగా దీనిని అభివృద్ధి చేస్తామంటూ ప్రజాప్రతినిధులు, అధికారులు హామీలు ఇస్తున్నా అవి కార్యరూపం దాల్చడం లేదు. కాగా రూ.3.27 కోట్లతో శ్మశానవాటికను అభివృద్ధి చేసేందుకు జీవీఎంసీ నిర్ణయించడంతో పాటు అభివృద్ధి పనులకు గతనెల 17న మేయర్ హరి వెంకటకుమారి శంకుస్థాపన చేశారు. అయినా ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదు. పెదగంట్యాడ, నెల్లిముక్కు, దుర్గవానిపాలెం, నీలాపువీధి, కోరాడ, సీతానగరం, అయ్యన్నపాలెం, మొల్లివానిపాలెం, సిద్ధేశ్వరం, దయాళ్‌నగర్ ప్రాంతాలకు చెందిన వారు ఎవరూ మృతి చెందినా ఈ శ్మశానవాటికలోనే అంత్యక్రియలు నిర్వహిస్తుంటారు. ఇన్ని కాలనీలకు శ్మశానవాటిక అయిన ఇక్కడ కనీస వసతులు లేకపోవడంతో అంత్యక్రియలకు వచ్చేవారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలు, చెత్తాచెదారం పేరుకుపోవడంతో దహనక్రియలు చేసేందుకు వచ్చేవారంతా నానాపాట్లు పడుతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి శ్మశానవాటికను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



పెదగంట్యాడలోని శ్మశానవాటిక

టీడీపీకి అధికారంతోనే ప్రజా సమస్యలు పరిష్కారం

పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం, మార్చి 13: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే ప్రజా సమస్యలన్నీ పరిష్కారమవుతాయని పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే పి.గణబాబు పేర్కొన్నారు. గ్రేటర్ 59వ వార్డులో ఎన్నికల ప్రచార కార్యక్రమం బుధవారం జరిగింది. ఇందులో పాల్గొని ఆయన మాట్లాడారు. టీడీపీ నేత చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు అన్ని వర్గాల ప్రజలకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ పథకాలను ప్రజలకు వివరించారు. వైసీపీ ఓడిస్తేనే ఈ రాష్ట్రానికి మంచి జరుగుతుందన్నారు. మరీ దుర్మార్గంగా వ్యవహరిస్తున్న ఆ పార్టీ నేతలకు బుద్ధి చెప్పి తీరాలని తెలిపారు.

చంద్రబాబును మళ్లీ ముఖ్య మంత్రిని చేస్తే రాష్ట్రం భవిష్యత్తు బాగుంటుందని ఈసందర్భంగా ఆయన అన్నారు. గణబాబుకు ప్రజలు హరతులు, పూలతో స్వాగతం పలికారు. ఈ ర్యాలీ గాజువాక డిపో నుంచి నక్కావానిపాలెం మీదగా హనుమాన్‌సంజీవకాలనీ వరకు సాగింది. ఈ కార్యమంలో జిల్లా టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు నక్కా లక్ష్మనరావు, నాయకుడు రామ్మోహన్ నాయుడు, పూడి బాస్కర్‌రావు, వార్డు టీడీపీ ప్రధాన కార్యదర్శి మితిరెడ్డి శంకరర్, దేవర ఈశ్వరరావు, శ్రీను, పొత్తబత్తుల శ్రీను, హరి, ఉరుకూటి మహేష్, జనసేన నేత శ్రీను, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గణబాబు

కల్వర్టు నిర్మాణ పనులకు శంకుస్థాపన



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి రూరల్, మార్చి 13: గ్రేటర్ 95వ వార్డు పరిధి లక్ష్మీపురం గవరపాలెం కాలనీలో 16.18 లక్షలతో చేపట్టనున్న మురుగునీటి సీసీ కాలువ నిర్మాణపనులకు బుధవారం అనకాపల్లి ఎంపీ బీశెట్టి సత్యవతి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, కార్పొరేటర్ ఎం.దేముడు, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు దాడి వరలక్ష్మి, అర్జునరావు, వైసీపీ నాయకులు కె. దేవీ, వెంకట గంగాధర్, పి.లక్ష్మణరావు, కాళ్ల సురేశ్, ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

'భవనాన్ని కూల్చడం సరికాదు'

పెందుర్తి, మార్చి 13: జీవీఎంసీ ఇచ్చిన అన్ని అనుమతులతో చేపట్టిన భవన నిర్మాణాన్ని ఆక్రమమంటూ వైసీపీ నేతల ఒత్తిడిపై టౌన్‌ప్లానింగ్ అధికారులు కూల్చివేయడం అన్యాయమని టీడీపీ నేత బండారు అప్పలనాయుడు ఆరోపించారు. చినముషిడివాడ బీఆర్టీఎస్ రహదారి సమీపంలో నాగభూషణం అనే వ్యక్తి చేపట్టిన ఈ భవన నిర్మాణాన్ని బుధవారం పట్టణ ప్రణాళికా సిబ్బంది కూలగొట్టారు. దీంతో బాధితులకు అండగా బండారు అప్పలనాయుడు ఇక్కడికి విచ్చేశారు. బాధితుడిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఎటువంటి నోటీసులు జారీ చేయకుండానే నిర్మాణాన్ని తొలిగించారని ఆయన ఆరోపించారు. అనంతరం అప్పలనాయుడు మాట్లాడుతూ జీవీఎంసీ అనుమతులతోనే నిర్మించిన ఈభవనాన్ని వైసీపీ నేతల అనుమతి లేదని అధికారులు కూల్చివేసినట్టు ఆరోపించారు. బాధితునికి అండగా ఉంటామన్నారు.

వైసీపీ నేతల భూ కబ్జాపై చర్యలు తీసుకోండి

తహసీల్దార్‌కు టీడీపీ నాయకుల ఫిర్యాదు

పెందుర్తి, మార్చి 13: మండలంలోని చింతగట్లలో స్థానిక సర్పంచ్ భర్త, వైసీపీ నేతలు ఇళ్లస్థలాల పేరిట ప్రభుత్వ భూమి కబ్జాకు పాల్పడుతున్నట్టు టీడీపీ, జనసేన నేతలు ఆరోపించారు. బుధవారం మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ బంగార్రాజుకు ఫిర్యాదు చేశారు. చింతగట్లలో సర్వే నంబరు 81-2లో సుమారు ఐదు ఎకరాల ప్రభుత్వభూమిలో ఇళ్ల స్థలాల పేరిట బినామీలతో తప్పుడు జాబితాను సృష్టించి స్థానిక సర్పంచ్ భర్త గనిశెట్టి కనకరాజు, వైసీపీ నేతలు భూ ఆక్రమణకు దిగుతున్నారని టీడీపీ నేత ఇప్పిలి చిన్నారావు ఈ సందర్భంగా ఆరోపించారు. ఇక్కడ గల ప్రభుత్వ భూమిలో టీడీపీ పాలనలో పేదలకు ఇళ్ల స్థలాలకు ఇచ్చేందుకు రెవెన్యూ సిద్ధమైందన్నారు. సర్పంచ్ భర్త గనిశెట్టి కనకరాజు కొంతమందితో అప్పుడు తప్పుడు పత్రాలతో ఈ భూమి రైతుల సాగులో ఉందంటూ కోర్టుని ఆశ్రయించి అడ్డుకున్నారని వారు ఆరోపించారు. దీనికి వ్యతిరేకంగా 62 మంది పేదలకు స్థలాల పంపిణీపై తామూ అభ్యంతరం తెలుపుతూ కోర్టులో కేసు వేసినట్టు ఆయన వివరించారు. ఇప్పుడు ఇదే భూమిలో ఇళ్లస్థలాలు ఎలా ఇవ్వనున్నారని ప్రశ్నించారు. ఈక్రమంలో ఇటీవల గనిశెట్టి కనకరాజు అనుచరులు ఇక్కడి స్థలాన్ని చదునుచేసే ప్రయత్నించగా, తాము అడ్డుకున్నామన్నారు. అయితే ఈస్థలంలో 107 మంది ఇళ్ల స్థలాలు మంజూరైనట్టు తహసీల్దార్ చెపుతున్నారన్నారు. రేషన్ కార్డుల మాయాజాలంతో బినామీల ద్వారా స్థలాలు తీసుకునేందుకు వైసీపీ నేతలు ప్రయత్నిస్తున్నట్టు ఆయన ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ జరగాలని డిమాండ్ చేశారు. అర్హులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో దాసరి రమణ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నేత ఇప్పిలి చిన్నారావు

వైభవంగా వెంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు

వేపగుంట, మార్చి 13: నాయుడుతోట రవినగర్ శేషాద్రి కొండపై కొలవైన శ్రీ కల్యాణ వెంకటేశ్వరాలయంలో 24వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం ఉదయం సుప్రభాత సేవ, బాలభోగ సమర్పణం తదితర విశేష పూజలు చేశారు. గ్రహదోష నివారణ, ఉద్యోగప్రాప్తికి నృసింహ హోమం నిర్వహించారు. సాయంత్రం నాయుడుతోట రవినగర్, వెంకసాయినగర్‌లో స్వామి ఉత్సవ విగ్రహాలను శేషవాహనంలో ఉంచి శోభాయాత్ర నిర్వహించారు. ఆనంతరం సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, కోలాటం ప్రదర్శన నిర్వహించారు. కేరళనుంచి వచ్చిన కళాకారుల వాయిద్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో అర్చకులు శ్రీనివాస స్వామి, వర్మ, కృష్ణమూర్తి, ఆదినారాయణరావు, శ్రీహరి, భాను, దేముడు, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.



కేరళ వాద్య బృందాలతో స్వామి వారి విగ్రహం ఊరేగింపు



పతకాలు సాధించిన క్రీడాకారులు, తదితరులు

కరాటే పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ

గాజువాక, మార్చి 13: మలేషియాలో ఈ నెల ఎనిమిది నుంచి పదో తేదీ వరకు జరిగిన 13వ సైలెంట్ నైట్ ఇంటర్నేషనల్ కరాటే చాంపియన్‌షిప్-2024 పోటీల్లో విశాఖ క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచి కాటా, కుమిటీ విభాగాలలో పతకాలు సాధించినట్టు కోచ్ సుమన్ తెలిపారు. ఈ మేరకు బుధవారం గాజువాకలో జిల్లా కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారుల అభినందన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12 దేశాల క్రీడాకారులు పాల్గొన్న కరాటే పోటీల్లో మనదేశం నుంచి ప్రాతినిధ్యం వహించిన విశాఖ క్రీడాకారులు ప్రతిభ చూపి పతకాలు సాధించడం ప్రశంసనీయ మన్నారు. క్రీడాకారులు ప్రవీణ్, మోనిష్, సాయిరక్షణం, కె.నీలేశ్‌లు బంగారు పతకాలు, లిఖిత, జగదీశ్ బ్రాంజ్ మెడల్స్‌ను సాధించారన్నారు.కార్యక్రమంలో కోచ్‌లు వీఎస్‌డీ ప్రవీణ్, మురళీకృష్ణ, కె.ప్రసాద్‌కుమార్,శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ జేఎల్ఎంకు ప్రతిష్ఠాత్మక అవార్డులు

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 13: స్టీల్‌ప్లాంట్‌కు చెందిన జగ్గయ్యపేట లైమ్ స్టోన్ మైన్ (జేఎల్ఎం)కు ప్రతిష్ఠాత్మకమైన రెండు అవార్డులను (లార్జ్ మెకనైజ్డ్ మైన్ కేటగిరిలో) సొంతం చేసుకుంది. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన మైన్స్ ఎన్విరాన్‌మెంట్ అండ్ మినరల్ కన్జర్వేషన్ వీక్ (ఎంఈఅండ్ఎంసీ) 2023-24లో ప్రతిష్ఠాత్మకమైన అవార్డులను ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ (ఐబీఎం) రీజనల్ కంట్రోలర్ ఆఫ్ మైన్స్ ఆర్ఆర్ డోంగ్రే జేఎల్ఎం మైన్స్ విభాగం అధికారులకు అవార్డులను అందజేశారు. మైన్స్‌లో పర్యావరణ పరిరక్షణ, స్థిరమైన పద్ధతులు, మైనింగ్ పరిశ్రమల్లో ఆవిష్కరణలు వంటి వాటిపై అవార్డులను సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్‌భట్, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్, ఆపరేషన్స్) ఏకే బాగ్చిలు అధికారులు, ఉద్యోగులను అభినందించారు.

అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వ పాలన: ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ, మార్చి 13: ఉచిత విద్య, వైద్యం ప్రధానాంశాలుగా రాష్ట్ర ప్రభుత్వ పాలన సాగుతుందని గాజువాక ఎమ్మెల్యే తిప్పలనాగిరెడ్డి అన్నారు. రూ.రెండు కోట్లతో నిర్మించిన బీసీ రోడ్డు, దయాళ్‌నగర్‌లో రూ.కోటితో నిర్మించిన ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రం, రూ.నాలుగు కోట్లతో చేపట్టిన సిద్ధేశ్వరం ప్రధాన రహదారిని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సిద్ధేశ్వరంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల గురుమూర్తిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య,వైసీపీ నాయకుడు తిప్పల దేవన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా 75వ వార్డు నెల్లిముక్కులో రూ.30 లక్షల వ్యయంతో నిర్మించిన నాయీబ్రాహ్మణ సామాజిక భవనాన్ని ఎమ్మెల్యే నాగిరెడ్డి ప్రారంభించారు. కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు



కూర్మన్నపాలెం, మార్చి 13: జీవీఎంసీ 71వ వార్డు పరిధి శ్రీనగర్‌లోని శ్రీకృష్ణ గోవర్ధనగిరి టెంపుల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం విజయగణపతి, రమా సత్యనారాయణస్వామి,శ్రీకృష్ణ గోవర్ధనగిరి ఆలయంలో శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.సూర్యనారాయణ, కె.సహదేవుడు మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి 20 వరకు ఆలయ వార్షికోత్సవాలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు లక్ష్మణరాజు, శ్రీనివాసరాజు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని ఓడిస్తేనే రాష్ట్రానికి భవిష్యత్తు

టీడీపీ విశాఖ పార్లమెంటు ఇన్‌చార్జి ఎం. శ్రీభరత్



వృద్ధురాలికి సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తున్న శ్రీభరత్

భీమునిపట్నం (రూరల్), మార్చి 13 : రాష్ట్రంలో వైసీపీ అరాచకాలు పెరిగిపోయాయని, వచ్చే ఎన్నికల్లో వారిని ఓడిస్తేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని టీడీపీ విశాఖ పార్లమెంటు ఇన్‌చార్జి ఎం. శ్రీభరత్ పిలు పునిచ్చారు. బుధవారం ఆయన తాళ్లవలసలో సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకోవడంతో పాటు వైసీపీ పాలనా వైఫల్యాలు గురించి ప్రజలకు వివరించారు. టీడీపీని గెలిపిస్తే నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి, పాఠశాలలకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ. 15 వేలు నగదు, ప్రతి రైతుకు ఏడాదికి రూ. 20 వేలు నగదు, మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామని తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, మాజీ ఎంపీపీ వై. కృష్ణవేణి, తాళ్లవలస ఎంపీటీసీ సభ్యుడు కె. రమణ, జడ్పీటీసీ మాజీ సభ్యుడు అప్పారావు, మొల్లి లక్ష్మణరావు, పతివాడ రాంబాబు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగా గెలిపిస్తే అభివృద్ధికి కృషి

పశ్చిమ నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త ఆనంద్‌కుమార్



ఆనంద్‌కుమార్‌కి స్వాగతం పలుకుతున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

మల్కాపురం, మార్చి 13 : పశ్చిమ నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఎన్నికల ప్రచారాన్ని బుధవారం ప్రారంభించారు. తొలుత జ్ఞానాపురంలోని ఎర్నిమాంబ ఆలయంలో సతీమణి చిన్ని, సోదరి యలమంచిలి మున్సిపల్ చైరపర్సన్ పిల్లా రమాకుమారితో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్థానిక 40వ వార్డు ఏకేసీ కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ విలువైన ఓటును తనకు వేసి ఎమ్మెల్యేగా గెలిపిస్తే గతంలో ఎన్నడూలేనంత అభివృద్ధి చేస్తానన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి ఎంతో మంచి చేస్తున్నారని, దేశంలో ఎక్కడా అమలుకానన్ని సంక్షేమ పథకాల ను అందజేస్తూ అందరి జీవితాలలో వెలుగులు నింపుతున్నారన్నారు. ఈసందర్భంగా మహిళలు హారతులతో, పూలమాలలు వేసి ఆయనకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వైసీపీ కార్పొరేటర్లు, అధ్యక్షులు, ఇన్‌చార్జీలు, పార్టీ మండల అధ్యక్షులు, జెసీఎస్ కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ సీనియర్ నాయకులు, ఆర్పీలు, ఆనంద్‌కుమార్ అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

అమర్‌నాథ్‌కు విమానాశ్రయంలో స్వాగతం

గోపాలపట్నం, మార్చి 13: వైసీపీ గాజువాక సమన్వయకర్తగా బాధ్యతలు స్వీకరించి నగరానికి విచ్చేసిన రాష్ట్ర ఐటీ శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు వైసీపీ నేతలు విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. బుధవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి విశాఖ చేరుకున్న అమర్‌నాథ్‌కు అనకాపల్లి ఎంపీ బి.సత్యవతి, వైసీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్, కేకే రాజు, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు తదితరులు స్వాగతం పలికారు.

సామాజిక న్యాయం టీడీపీతోనే సాధ్యం

» రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్


మాట్లాడుతున్న మహ్మద్ నజీర్

మహారాణిపేట, మార్చి 13: ముస్లింలకు రాజకీయ, ఆర్థిక, సామాజిక పరంగా అండగా నిలిచిన ఏకైక పార్టీ తెలుగుదేశం అని ఆపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్ అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముస్లిం మైనారిటీలను అన్ని విధాలుగా గౌరవించి ఉన్నత పదవులను తమ పార్టీ కల్పించినట్టు పేర్కొన్నారు. బషీరుద్దీన్ బాబూఖాన్‌ను తొలుత గుర్తించి మంత్రి పదవి ఇచ్చిన ఘనత తమ పార్టీదేనన్నారు. ఎంతోమంది తమ సామాజిక వర్గానికి చెందిన వారికి చంద్రబాబునాయుడు గుర్తించి అనేక పదవులు కల్పించి, సామాజిక న్యాయానికి మారు పేరుగా నిలిచారన్నారు. ప్రస్తుత రాజకీయ సమీకరణాలలో విశాఖ దక్షిణ నియోజకవర్గ టికెట్ తనకు కేటాయించాలన్నారు. ఇప్పటికే ఈమేరకు అధిష్టానానికి దరఖాస్తు చేసుకున్నానని, అవకాశం కల్పిస్తే పోటీ చేసి గెలుస్తానని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు.

కవయిత్రి మొల్ల గర్వించదగిన సాహితీవేత్త

మహారాణిపేట, మార్చి 13: కవయిత్రి మొల్ల దేశం గర్వించదగిన సాహితీవేత్త అని డీఆర్వో కె. మోహన్ కుమార్ అన్నారు. కవియిత్రి ఆతుకూరి మొల్ల జయంతిని బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. మొల్ల చిత్రపటానికి డీఆర్వో పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగులో తొలి కవియిత్రిగా మొల్ల రామాయణ కావ్యాన్ని రాసి అందరినీ విశేషంగా ఆకట్టుకున్నారన్నారు. ఈకార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి కె. శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వృద్ధుడు మృతి

మర్రిపాలెం, మార్చి 13: రోడ్డు ప్రమాదంలో గాయపడిన గుర్తు తెలియని వృద్ధుడు చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మృతి చెందినట్టు ఎయిర్‌పోర్ట్ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. గత నెల 2వతేదీన ఎన్‌ఏడీ జంక్షన్ నుంచి మర్రిపాలెంవైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఈ వృద్ధునికి తీవ్రగాయాలు కాగా, అతడిని చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. బుధవారం వీఆర్వో సాయిభారతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు ఫోన్: 8331041645 సమాచారమివ్వాలని ఎస్‌ఐ కోరారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు లైన్ క్లియర్

డాబాగార్డెన్స్, మార్చి 13: రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలకు సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారం నిధులు కేటాయిస్తూ ఆర్థిక శాఖ ఒక రెండు రోజుల్లో జీవో జారీ చేయనుందని ఐ అండ్ పీఆర్‌రాష్ట్ర కమిషనర్ విజయ్‌కుమార్ రెడ్డి విశాఖ అక్రిడేటెడ్ వర్కింగ్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధి బృందానికి తెలిపారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల ప్రక్రియను వేగవంతం చేయాలనికోరుతూ విశాఖ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు బి.రవికాంత్, ఆర్గనైజింగ్ కార్యదర్శి పీపీ రావు బుధవారం ఆయనకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఎన్నికల కోడ్‌తో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల ప్రక్రియకు సంబంధం లేదని ఆయన తెలిపారు. స్థలాల కేటాయింపు ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్లు, అధికారులకు సీఎం జగన్ ఆదేశాలు జారీ చేశారని వెల్లడించారు. ఈ మేరకు నిధులు కేటాయింపు చేస్తూ ఆర్థిక శాఖ నుంచి ఆదేశాలిచ్చినట్టు చెప్పారు.


పార్కులో తుప్పు పట్టిన జారుడు బల్ల


పార్కులో ఉతికిన బట్టలు ఆరబెట్టిన దృశ్యం

పార్కు ఇలా.. సేదతీరేదెలా?

» నిరుపయోగంగా తాటిచెట్లపాలెం తారకరామనగర్ పార్కు » తుప్పు పట్టిన క్రీడా పరికరాలు » పట్టించుకోని జీవీఎంసీ

అక్కయ్యపాలెం, మార్చి 13: గ్రేటర్ 45వ వార్డు పరిధి తాటిచెట్లపాలెం తారకరామనగర్‌లోని పార్కు శిథిలావస్థకు చేరుకుని నిరుపయోగంగా మారింది. పార్కు ప్రారంభించిన తొలుతలో పిల్లలు, పెద్దలు ఉదయం, సాయంత్రం సేద తీరేవారు. పార్కులో వివిధ ఆట వస్తువులుండడంతో పిల్లలు ఆడుకునేవారు. రోజులు గడచిన కొద్దీ ఆట వస్తువులన్నీ పాడైపోయి తుప్పు పట్టడంతో పిల్లలు ఆటలకు దూరమయ్యారు. పార్కు దుస్థితి చూసి పెద్దలు కూడా రావడం మానేశారు. దీంతో ప్రస్తుతం నిరుపయోగంగా దర్శనమిస్తోంది. గతంలో విశాఖలోని అన్ని పార్కులను పునరుద్ధరించినా, దీనిని మాత్రం పట్టించుకోకుండా వదిలేశారు. ఫలితంగా స్థానికులు క్రీడా సామగ్రిపై ఉతికిన బట్టలు ఆరబెట్టుకుంటున్నారు. 2017లో ఇక్కడున్న ఖాళీ స్థలంలో పిల్లల కోసం ఈ పార్కును ఏర్పాటు చేశారు. చిన్నారులు ఆడుకునేందుకు వీలుగా జారుడు బల్ల, ఊయల వివిధ రకాల సామగ్రిని ఏర్పాటు చేశారు. మొదట్లో నిర్వహణ ఉండడంతో ఏడాది వరకు సవ్యంగా నడిచింది. క్రమేపీ వాచ్‌మెన్ లేకపోవడం, జీవీఎంసీ అధికారులు గానీ, స్థానికులుగానీ పార్కు నిర్వహణ పట్టించుకోకపోవడంతో పార్కులో ఉన్న ఆట వస్తువులు ఒక్కొక్కటీ మూలకు చేరుకున్నాయి. ప్రహరీ శిథిలమైంది. ప్రధాన ద్వారం కూడా పాడైపోయింది. ఆట వస్తువులను కొం తమంది ఎత్తుకు వెళ్లగా, మిగిలినవి మూలకు చేరాయి. ఇదే అదనుగా స్థానికులు పార్కులో చెత్త వేస్తున్నారు. పరిసర ప్రాంతాల్లో భవన నిర్మాణాల వ్యర్థాలు, డెబ్రిస్‌ను వేస్తూ డంపింగ్‌యార్డుగా మార్చేస్తున్నారు.

కల్యాణ మండపంగా మార్చాలని వినతులు

చాలామేరకు మురికివాడలున్న ఈ ప్రాంతంలో నిరుపేద, దిగువ మధ్యతరగతి కుటుంబాలే నివాసముంటున్నాయి. ఈస్థితిలో ఏ శుభ కార్యం చేసుకోవాలన్నా రోడ్డుపై టెంట్లు వేసుకుని కొనసాగిస్తున్నారు. ఒక వేళ పెళ్లిళ్ల వంటి పెద్ద కార్యక్రమాలైతే ఇతర ప్రాంతాల్లోని కల్యాణమండపాలకు వెళ్లాల్సి వస్తోందని స్థానికులు చెబుతున్నారు. అధిక మొత్తంలో అద్దెలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. ఈ పార్కును పునరుద్ధరించే పరిస్థితి లేనందున కల్యాణమండపం నిర్మిస్తే ప్రజోపయోగకరంగా ఉంటుందని స్థానికులు కోరుతున్నారు.

ఎన్నికల్లో పోటీ చేయను.. ప్రచారం చేస్తా..

» మాజీ మంత్రి, సినీ నటుడు బాబూమోహన్



మాట్లాడుతున్న బాబూమోహన్

అక్కయ్యపాలెం, మార్చి 13: ఈసారి ఎన్నికల్లో తాను పోటీ చేయడం లేదని ప్రజాశాంతి పార్టీ జాతీయ కోర్ కమిటీ సభ్యుడు బాబూమోహన్ ప్రకటించారు. విశాఖపట్నం వచ్చిన ఆయన దొండపర్తిలోని కేఏ పాల్ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. బీజేపీ చేసిన మోసం వల్ల ఆ పార్టీకి రాజీనామా చేశానని, ప్రజాశాంతి పార్టీలో చేరానని వివరించారు. కాకినాడ లేదా గాజువాక నియోజకవర్గాల నుంచి పార్టీ తరపున పోటీ చేయాలని కేఏ పాల్ కోరారని, అయితే తాను తిరస్కరించానన్నారు. ఈ ఎన్నికల్లో కేఏ పాల్ పార్టీ తరపున ప్రచారం చేస్తానని చెప్పారు. విశాఖ ఎంపీగా కేఏ పాల్‌ను గెలిపించాలని కోరారు. ఆయన సమస్యలు పరిష్కరిస్తారన్నారు.

51 మందికి పీఎం స్వరాజ్ రుణాల పంపిణీ


రుణాలను అందిస్తున్న జేసీ మయూర అశోక్

మహారాణిపేట, మార్చి 13: ప్రధాన మంత్రి స్వరాజ్ పథకం కింద జిల్లా వ్యాప్తంగా 51 మందికి రూ.2.17 కోట్ల రుణాలను జాయింట్ కలెక్టర్ కె.మయూర అశోక్ బుధవారం పంపిణీ చేశారు. మరో 31 మందికి ఆయుష్మాన్ కార్డులు, 32 మంది లబ్ధిదారులకు పీపీఈ కిట్లను అందజేశారు. సామాజిక న్యాయం సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ పథకాన్ని ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. కార్యక్రమంలో పలువురు అధికారులుపాల్గొన్నారు.

నేడు ఏయూలో నాక్ సర్టిఫికెట్లు ప్రదానం

విశాఖపట్నం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని గురువారం నాక్ సర్టిఫికెట్లను ప్రదానం చేయ నున్నారు. బీచ్ రోడ్డులోని కన్వెన్షన్ హాల్‌లో మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహించనున్న కార్యక్రమంలో శ్రీనివాసరావు పేరుతో పరిశోధకులు, నాన్ టీచింగ్, టీచింగ్ స్టాఫ్, ఇతర అధికారులు, సిబ్బందికి సమాచారాన్ని అందించారు. సాధారణంగా ఈ తరహా సమాచారం రిజిస్ట్రార్ పేరుతో వస్తుంది. కానీ, శ్రీనివాసరావు పేరుతో హోదా, ఇతర వివరాలు లేకుండా సమాచారం ఇవ్వడంతో దానిపై వర్సిటీలో చర్చ జరుగుతోంది.

రంజాన్ నేపథ్యంలో రేషన్ పంపిణీ


సమావేశంలో మాట్లాడుతున్న గండి బాబ్జీ

జగదాంబ కూడలి, మార్చి 13: గ్రేటర్ 39వ వార్డు కోటవీధి ప్రాంతంలో ముస్లింతదితర కుటుంబాలకు టీడీపీ నాయకుడు గఫూర్ రంజాన్ పురస్కరించుకుని రేషన్ కిట్లను పంపిణీ చేశారు. బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆ పార్టీ ఇన్‌చార్జి గండి బాబ్జీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గఫూర్ 1999నుంచి నేటికి 25 ఏళ్లుగా పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా అందించడం గొప్పవిషమన్నారు. ముస్లింలకు అన్నివిధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. గఫూర్ మాట్లాడుతూ కోటవీధి పరిసర ప్రాంతాల్లో పేద కుటుంబాలు కనీస వసతులు లేక దుర్భర స్థితిలో జీవనం సాగిస్తున్నాయన్నారు. పరిసరాలు పారిశుధ్య లోపంతో ఇబ్బంది ఎదుర్కొంటున్నారన్నారు. కరెంట్, మంచినీటి కష్టాలు తప్పడం లేదని వాపోయారు. పోర్టు కాలుష్యంతో రోగాల బారిన పడుతున్నారన్నారు.వీరికి జీవీఎంసీ అధికారులుకనీసవసతులు కల్పించాలన్నారు.మతాలకతీతంగా అందరికీ రంజాన్ మాసంలో నిత్యావసరాలు అందజేసినట్లు తెలిపారు. ముస్లిం మత పెద్దలు, టీడీపీ నాయకులున్నారు.

బాధితులకు ఆర్థికసాయం పంపిణీ

సీతమ్మధార, మార్చి 13: సీతమ్మధారలోని వైసీపీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన ఉత్తర నియోజక వర్గ సమన్వయకర్త కేకే రాజు 22 మందికి రూ.22.27 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. కార్పొరేటర్లు అనిల్‌కుమార్ రాజు, సారిపిల్లి గోవింద్ పి.ఉషశ్రీ, శశికళ పాల్గొన్నారు.

జ్ఞానాపురం: జీవీఎంసీ 41వ వార్డు హోలీ క్రాస్ స్ట్రీట్‌కు చెందిన బాలింత రీనా ఎముక వ్యాధితో బాధపడుతుండడంతో మెరుగైన వైద్యం కోసం సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ. 3 లక్షలు విడుదలైంది. ఈ చెక్కును ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్ బుధవారం బాధితురాలి కుటుంబానికి అందించారు.

ఉడా కాలనీలో యథేచ్ఛగా పశువుల సంచారం


కాలనీ రోడ్లపై పశువులు

మాధవధార, మార్చి 12 ; గ్రేటర్ 51వ వార్డు మాధవధార ఉడాకాలనీ, పరిసర ప్రాంతాల్లో పశువుల స్వైర విహారంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పగలూ, రాత్రి తేడాలేకుండా సమీప మురికివాడల్లోని పశువులను కాపరులు కాలనీలో విడిచి పెట్టి పోతున్నారు. 48ఏ బస్ రూట్‌లో బస్సులు, భారీ వాహనాలు, ఇతర వాహనదారులకు ఇవి అడ్డుపడి ప్రమాదకరంగా మారుతున్నాయి. మరోవైపు కాలనీలో పచ్చదనం హరించుకుపోతోంది. ఇళ్ల ఆవరణలో ఉన్న పూల మొక్కలు, చిన్నపాటి గార్డెన్ పెంపకాలను పశువులు ధ్వంసం చేస్తున్నాయి. పదుల సంఖ్యలో పశువుల గుంపుతో కాలనీలో సమస్యగా తయారైంది. రాత్రి వేళల్లో రోడ్లకు అడ్డంగా నిద్రిస్తున్న గేదెలు వాహనాలు అతి సమీపంగా వచ్చే వరకు గుర్తించడం కష్టంగా మారి వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. పశువుల సంచారాన్ని నియంత్రించాలని మాధవధార ఉడాకాలనీ, ఆర్టీఓ కార్యాలయ పరిసర ప్రాంతాల నివాసితులు కోరుతున్నారు.

'బాగా చదువుకుని ఉద్యోగాలు పొందాలి'


క్విజ్ పోటీ విజేతులతో గ్రంథాలయ సొసైటీ కార్యదర్శి సూర్యారావు

సీతంపేట, మార్చి 13: ఉన్నత లక్ష్య సాధనతో విద్యార్థులు బాగా చదివి మంచి కొలువులు పొందాలని గ్రంథాలయ సొసైటీ సహ కార్యదర్శి డాక్టర్ డీవీ సూర్యారావు పేర్కొన్నారు. విశాఖ పౌరగ్రంథాలయంలో ఉద్యోగార్థులకు వివిధ పోటీ పరీక్షల పాఠ్యాంశాలతో క్విజ్ పోటీలను నిర్వహించారు. వర్తమాన అంశాలతో పాటు గ్రూప్- 2 మెయిన్స్ సిలబస్ ఆధారంగా వివిధ శాస్త్రాలపై క్విజ్ పోటీ నిర్వహించారు. ఈ పోటీల్లో గ్రంథాలయంలో చదువుతున్న, వివిధ కళాశాల విద్యార్థులు 60 మంది బృందాలుగా పాల్గొన్నారు. గెలుపొందిన విద్యార్థులకు పుస్తకాలు బహూకరించారు. గ్రాంథపాలకులు దుర్గారాణి పర్యవేక్షణలో నిర్వహించారు.

నిషేధిత యాంటీబయోటిక్స్‌పై అవగాహన


సమావేశంలో పాల్గొన్న సంస్థ ప్రతినిధులు

అల్లిపురం, మార్చి 13: కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎక్స్‌పోర్ట్ ఇన్స్‌పెక్షన్ కౌన్సిల్, ఎక్స్‌పోర్ట్ ఇన్స్‌పెక్షన్ ఏజెన్సీ చెన్నై, విశాఖ కేంద్ర సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. విశాఖ, కాకినాడ ప్రాంతాల్లోని వివిధ ఆమోదిత సీఫుడ్ సంస్థల సాంకేతిక నిపుణులకు ఎల్సా టెక్నిక్ ద్వారా యాంటీబయోటిక్స్ స్క్రీనింగ్, నిషేధిత యాంటీబయోటిక్స్‌పై రెండురోజులపాటు శిక్షణ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారికి అసిస్టెంట్ డైరెక్టరు ఎస్.శేఖర్ దాస్, డిప్యూటీ డైరెక్టర్ జి జయపాలన్ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కుమార్, చిన్ని రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టికెట్ టెన్షన్!

... 5వ పేజీ తరువాయి

జిల్లా చీపురుపల్లి నుంచి పోటీ చేయాల్సిందిగా చంద్రబాబునాయుడు సూచించారు. ఈ నేపథ్యంలో తన వియ్యంకుడు పి.నారాయణతో కలిసి గంటా బుధవారం ఉదయం చంద్రబాబునాయుడును కలిశారు. దీంతో భీమిలి నుంచి ఎవరు బరిలో దిగుతారోనన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. 'సౌత్' సీటును జనసేనకు కేటాయించిన నేపథ్యంలో తగిన న్యాయం చేస్తామని అక్కడ ఇన్‌చార్జి గండి బాబ్జీకి అధినేత భరోసా ఇచ్చారు.

ఇక జనసేనకు కేటాయించిన విశాఖ దక్షిణ నియోజకవర్గం నుంచి చెల్లుబోయిన వంశీకృష్ణ శ్రీనివాసయాదవ్, పెందుర్తి నుంచి పంచకర్ల రమేష్‌బాబు, బీజేపీకి ఇచ్చిన విశాఖ ఉత్తరం నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు పేర్లు దాదాపు ఖరారైనట్టు చెబుతున్నారు.

పార్లమెంటు బరిలో ఎం.శ్రీభరత్?

విశాఖ లోక్‌సభ స్థానానికి టీడీపీ తరపున ఎం.శ్రీభరత్ పేరు దాదాపు ఖరారైంది. పొత్తులో భాగంగా బీజేపీ విశాఖ లోక్‌సభ సీటు తమకు కేటాయించాలని కోరింది. అయితే అందుకు చంద్రబాబునాయుడు అంగీకరించలేదు. ఈ నేపథ్యంలో శ్రీభరత్ పేరు ప్రకటన లాంఛనమేనని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. గురువారం ప్రకటించే జాబితాలో ఆయన పేరు ఉండే అవకాశం ఉంది.

ఓపెన్ స్కూల్ పరీక్షలకు వసూళ్లు!?

... 5వ పేజీ తరువాయి

వ్యవహారంలో ఆనందపురం మండలంలో ఒక ఉన్నత పాఠశాల టీచర్ కీలక పాత్ర పోషిస్తారన్న ఆరోపణలున్నాయి. ఓపెన్ స్కూళ్ల ద్వారా పరీక్షలు రాసే అభ్యర్థుల నుంచి సొమ్ముల వసూళ్ల వ్యవహారంపై డీఈవో ఎల్.చంద్రకళ వద్ద ప్రస్తావించగా పరీక్షల నిర్వహణలో ఎటువంటి అవకతవకలకు పాల్పడకుండా చర్యలు తీసుకుంటామన్నారు. పరీక్షలు పక్కాగా జరిగేందుకు ప్రతి కేంద్రానికి సిట్టింగ్ స్క్వాడ్‌లు నియమిస్తామన్నారు. ఎవరికీ అభ్యర్థులు సొమ్ములు ఇవ్వొద్దని కోరారు. ఇంకా ఎవరైనా ఇవ్వాలని ఒత్తిడి తీసుకువస్తే తమకు ఫిర్యాదు చేయాలన్నారు.

ఆశావహుల్లో ఉత్కంఠ

... 5వ పేజీ తరువాయి

తెలిసింది. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు రాజ్యసభ సభ్యుడు సీఎం రమేశ్ పేరు దాదాపు ఖరారైంది. తొలుత టీడీపీ, జనసేన పొత్తుల నేపథ్యంలో అనకాపల్లి ఎంపీ స్థానాన్ని జనసేనకు కేటాయిస్తారని, పవన్‌కల్యాణ్ సోదరుడు నాగబాబు పోటీ చేస్తారని ప్రచారం జరిగింది. కూటమిలో బీజేపీ కూడా చేరడంతో ఇప్పుడు అనకాపల్లి పార్లమెంట్ స్థానాన్ని బీజేపీకి కేటాయించారు. సామాజిక సమీకరణల్లో భాగంగా కడప జిల్లాకు చెందిన సీఎం రమేశ్ పేరును అధిష్ఠానం పరిశీలిస్తున్నట్టు సమాచారం. ఆయన అభ్యర్థిత్వాన్ని ఒకటి, రెండు రోజుల్లో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని చెబుతున్నారు. సీఎం రమేశ్‌తోపాటు బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, మహిళా మోర్చా నాయకురాలు తోట విజయలక్ష్మి పేర్లను కూడా పార్టీ అధిష్ఠానం పరిశీలిస్తున్నట్టు సమాచారం.

రోడ్డునపడ్డ మానసిక దివ్యాంగులు

... 5వ పేజీ తరువాయి

దివ్యాంగుల పాఠశాల నడుస్తోంది. ఇక్కడ 200 మందికి సరిపడా వసతి లేకపోవడంతో పిల్లలకు వంటా వార్పు, భోజనాలు రోడ్డుపైనే నిర్వహించాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. అంతేకాదు పిల్లలకు పలు అంశాల్లో శిక్షణ ఇచ్చే అవకాశం కూడా లేకుండాపోయింది.

అధికారులు స్పందించాలి

- కండిపిల్లి శ్రీనివాసరావు, 'హిడెన్ స్ప్రౌట్స్' పాఠశాల నిర్వాహకుడు

పాఠశాలను ఖాళీ చేయించడంతో జీవీఎంసీ స్థలంలోనే మూడు బస్సులు, ఆరు కంప్యూటర్లు, మూడు జెరాక్స్ మిషన్లు, ప్రింటర్, ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, బుక్ బైండింగ్ యూనిట్, వ్యాయామ సామగ్రి, విద్యుత్ వస్తువులు ఉండిపోయాయి. మూడేళ్లుగా ఉపయోగించకపోవడం, నిర్వహణ లేక పాడైపోతున్నాయి. అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా ఫలితం కనిపించడం లేదు. పాఠశాలను తొలగించిన స్థలాన్ని చూస్తే కళ్లలో నీరు తిరుగుతోంది. ప్రస్తుతం అది అడవిని తలపిస్తోంది. ఆ స్థలంలో ఇప్పటివరకూ ఎలాంటి పనులు చేపట్టలేదు. అధికారులు స్పందించి దివ్యాంగులను ఆదుకోవాలి.



విద్యార్థినులకు కెరియర్ గ్రోత్‌పై శిక్షణ


విద్యార్థినులకు సర్టిఫికెట్స్ ప్రదానం

డాబాగార్డెన్స్, మార్చి 13: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో డిగ్రీ విద్యార్థినులకు మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సాఫ్ట్ కమ్యూనికేషన్ స్కిల్స్, కెరీయర్ గ్రోత్ పై ట్రైనింగ్ ప్రోగ్రామ్ పూర్తయినట్టు కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి తెలిపారు. ఈ ఏడురోజుల పాటు నిర్వహించిన ఈశిక్షణలో పరిశ్రమలకు అవసరమైన వివిధ నైపుణ్యాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించినట్టు చెప్పారు. మంచి ప్లేస్‌మెంట్స్ సాధించేందుకు శిక్షణ దోహదం చేస్తుందన్నారు. శిక్షణలో పాల్గొన వారికి సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డి.అరుణపద్మ, కె. అనూష, డి.ప్రజ్ఞ పాల్గొన్నారు.

రామాయణం భారతీయ సంస్కృతికి మూలం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రముఖ సాహితివేత్త టీపీఎన్ ఆచార్యులు

సీతమ్మధార, మార్చి 13: వేదాల సారాన్ని రామాయణ మహాకావ్యంగా రచించి భారతీయ సంస్కృతికి వాల్మీకి మూలస్తంభంగా నిలిచారని సహృదయ సాహితి సంస్థ వ్యవస్థాపకులు శేఖరమంత్రి ప్రభాకర్ అన్నారు. సీతంపేట రాజేంద్రనగర్‌లోని ప్రిజమ్ కళాశాలలో సహృదయ సంస్థ ఆధ్వర్యంలో రామాయణంలో రసరమ్య ఘట్టాలు అనే అంశంపై నిర్వహించిన ప్రసంగ కార్యక్రమం ఆహూతులను ఆకట్టుకుంది. సభకు అధ్యక్షత వహించిన ప్రభాకర్ మాట్లాడుతూ రామాయణం మానవ జీవితాలకు సుసంపన్నం చేసే మహాకావ్యమన్నారు. ప్రధాన వక్తగా విచ్చేసిన ప్రముఖ సాహితీవేత్త టీడీఎన్ ఆచార్యులు రామాయణంలో పలు ఘట్టాలను వివరించారు. రామ నామమహిమ, పుంజకస్థల వృత్తాంతం, అష్టాక్షరి, పంచాక్షరిలోని పలు విషయాలు వివరించారు. అలాగే రావణ కాష్టం, సీతాదేవి జన్మవృత్తాంతం తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయనిర్మాణ్ అధినేత డాక్టర్ సూరపనేని విజయకుమార్, విశ్లేషకులు డాక్టర్ డీవీ సూర్యారావు, చిన సూర్యనారాయణ, భాగవతుల సత్యనారాయణ మూర్తి, అయ్యల సోమయాజుల ప్రసాద్ పాల్గొన్నారు.

విజన్ విశాఖ ధ్యేయం : వైవీ


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న వైవీ సుబ్బారెడ్డి, మేయర్ తదితరులు

సిరిపురం, మార్చి 13 : విజన్ విశాఖే ధ్యేయంగా నగరాన్ని అంతర్జాతీయస్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని వైసీపీ ఉత్తరాంధ్ర జిల్లాల కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2019కి ముందు తరువాత విశాఖ అభివృద్ధిని గ్రహించాలన్నారు. అంతకు ముందు జీవీఎంసీ పరిధిలో సుమారు రూ.147 కోట్లతో చేపట్టనున్న 423 అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారి, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, కేకే రాజు, డిప్యూటీ మేయర్లు శ్రీధర్, సతీష్, కమిషనర్ సాయికాంత్ వర్మ ఉన్నారు.

చెదురుతున్న జ్ఞాపకం

» దుమ్ము, ధూళి మధ్య వన్‌టౌన్‌లోని విక్టోరియా విగ్రహం

» పట్టించుకోని పాలనా యంత్రాంగం

జగదాంబ కూడలి, మార్చి 13: విశాఖ చరిత్రకు ఆనవాళ్లుగా నిలిచే వన్‌టౌన్‌లోని విక్టోరియా రాణి స్థూపం దుమ్ము, ధూళి, బీటలు వారిన గోడలతో కళావిహీనంగా మారింది. విక్టోరియా రాణి కాంస్య విగ్రహం పోర్టు కాలుష్యంతో మసకమారితోంది. వన్‌టౌన్‌లో 120 ఏళ్ల చరిత్ర గలిగిన ఈ స్మారక స్థూపం పరిసరాలు పూర్తిగా చెత్తా చెదారాలతో నిండిఉంటున్నాయి. కొన్నేళ్ల కిందటి వరకు ఈ స్థూపం ప్రత్యేక ఆకర్షణగా ఉండేది. పోర్టు వెంకటేశ్వర గుడి, పోర్టు పరిసరాలు తిలకించేందుకు వచ్చే వారు విక్టోరియా విగ్రహాన్ని చూసేందుకు వచ్చేవారు.. స్థూపం చరిత్ర తెలుసుకునేందుకు ఆసక్తి చూపేవారు. ప్రస్తుతం విక్టోరియారాణి విగ్రహం స్థూపం ఆలనాపాలనా లేనిదిగా మారింది. దీంతో బ్రిటీషు కాలం నాటి చరిత్ర పూర్తిగా కనుమరుగవుతుందన్న ఆవేదన సందర్శకుల్లో వ్యక్తమవుతోంది. గతంలో పాలకులు కొంత మేరకైనా దీని సంరక్షణపై దృష్టి పెట్టడంతో ఎంతో ఆహ్లాదంగా కనిపించేది.గత పదేళ్లనుంచి ఎవరూ పట్టించుకోవడంలేదు. జీవీఎంసీ దృష్టి సారించి పూర్వవైభవం తీసుకురావాలని నగర వాసులు కోరుతున్నారు.


శిథిలావస్థలో విక్టోరియ రాణి విగ్రహం


ఆవరణలో చెత్తాచెదారాలు

జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎన్ఆర్ఐ విద్యార్థినులు



విద్యార్థినులను అభినందిస్తున్న అధ్యాపకులు

తగరపువలస, మార్చి 13 : సంగివలసలోని ఎన్ఆర్ఐ డెంటల్ కళాశాలకు చెందిన వెంకట గాయత్రి, జి.సిరి, జ్యోతి మణిమాల జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారు.ఈనెల 21 నుంచి 25 వరకు తమిళనాడులోని దిండిగల్‌లో జరిగే పోటీల్లో వారు పాల్గొనున్నారు. ఈమేరకు కళాశాల యాజమాన్యం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రస్థాయిలో ఈనెల 11, 12 తేదీల్లో విజయవాడ సిద్ధార్థ కళాశాలలో జరిగిన అంతర్ కళాశాలల పోటీల్లో వారు ప్రతిభ చూపడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారన్నారు.విద్యార్థినులను కళాశాల అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

'యువత సేవాభావం కలిగి ఉండాలి'

సాగర్‌నగర్, మార్చి 13 : పూర్ణామార్కెట్ సమీపంలోని జీవీఎంసీ హైస్కూల్, ఎంవీడీఎంసీ హైస్కూల్‌లో గీతం యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఎంవీడీఎంసీ హైస్కూల్ హెచ్ఎం ఎస్‌వీ శేషి కుమారి బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా మానవ సంబంధాల ప్రాధాన్యతను అర్థం చేసుకోవాలన్నారు. ఏ రంగంలో ఉన్నా సమాజం పట్ల బాధ్యతను మరవకూడదన్నారు. అనంతరం ఎన్ఎస్ఎస్ వలంటీర్లు నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. అలాగే పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో గీతం ఎన్ఎస్ఎస్ యూనిట్ 13 ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎస్కే రఘు, యూనిట్ 4 ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ జి. శ్రీనివాసరావు బి. కవిత పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయంలో 'సూఫీ స్నేహ సంవాద్'

పెదవాల్తేరు, మార్చి 13 : నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ విశాఖ జిల్లా మైనారిటీ మోర్చా అధ్యక్షురాలు తిరుకోటి భారతి అధ్వర్యంలో సూఫీ స్నేహ సంపద్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా మైనారిటీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతాడ మోహన్‌రావు సూఫీ తత్వం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ మోర్చా జిల్లా ఇన్‌చార్జి శ్రీరంగం ధనేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు చొక్కాకుల రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి భాషా, కార్యవర్గ సభ్యుడు సీహెచ్ రాజబాబు పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతి ఉన్నతమైనది : వీసీ

వెంకోజీపాలెం, మార్చి 13 : భారతీయ సంస్కృతి ఎంతో విశిష్టమైనదని ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డి అన్నారు. బుధవారం ఏయూ సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఎత్నిక్ డే వేడుకల్లో ఆయన మాట్లాడారు. వైవిధ్యమైన భాషలు, కట్టుబాట్లు, వస్త్రధారణ, జీవన విధానాలు కలిగి ఉన్న సుందర దేశంగా భారత్ నిలుస్తుందన్నారు. దేశ ప్రజలందరినీ ఐక్యం చేసేది మన సంస్కృతేనన్నారు. యువత తమ సామర్థ్యాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం ఆచార్యులు, తదితరులు పాల్గొన్నారు.



ఎత్నిక్ డే వేడుకల్లో పాల్గొన్న వీసీ ప్రసాదరెడ్డి

సినిమా గైడ్

- **భీమా :** మెలోడి, సంగం, శ్రీరామ, శారద, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక), నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్-2 (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), రాములమ్మ (తగరపువలస)
- **గామి :** జగదాంబ, శరత్, కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), గణేష్ (తగరపువలస), నటరాజ్ (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం),
- **ప్రేమలు :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మి (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఇంటి నెం.13 :** రమాదేవి, మోహిని (గాజువాక)
- **ఆపరేషన్ వాలెంటైన్ :** రమాదేవి, మౌర్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజవాక)
- **ఊరు పేరు భైరవకోన :** వెంకటేశ్వర, కామేశ్వరి, కన్య-2 (గాజువాక)
- **హనుమాన్ :** లీలామహల్, నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 24,టమాటా 17, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 32, బెండకాయలు 24, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 40, బీరకాయలు 34, ఆనపకాయలు 14, కాలీఫ్లవర్ 24, క్యాబేజీ 22, క్యారెట్ 25, దొండకాయలు 22, బంగాళా దుంపలు 21, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 46, అల్లం (పాతది) 125, బరబటి 16, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 32, దోస కాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 150, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 52, ఆగాకర 52, పొటల్స్ 62, కీరదోస 28, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 54, చిలగడదుంపలు 26 , కంద 60, దేముడు చిక్కుడు 56, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 55, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	450
విజయనగరం	454
శ్రీకాకుళం	454

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 95
ఫారం ధర	-- 115
విత్ స్కిన్	-- 200
స్కిన్‌లెస్	-- 210

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..



తాళ్లవలసలో సూపర్ సిక్స్ పథకాల గురించి వివరిస్తున్న శ్రీభరత్



13వ వార్డు ఎస్ఎస్ఎన్ నగర్‌లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

వైసీపీని ఓడిస్తేనే రాష్ట్రానికి భవిష్యత్తు

- టీడీపీ విశాఖ పార్లమెంటు ఇన్‌చార్జి ఎం. శ్రీభరత్
- తాళ్లవలసలో సూపర్ సిక్స్‌పై అవగాహన

భీమునిపట్నం (రూరల్), మార్చి 13 : రాష్ట్రంలో వైసీపీ అరాచకాలు పెరిగిపోయాయని, వచ్చే ఎన్నికల్లో వారిని ఓడిస్తేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని టీడీపీ విశాఖ పార్లమెంటు ఇన్‌చార్జి ఎం. శ్రీభరత్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన తాళ్లవలసలో సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసు కోవడంతో పాటు వైసీపీ పాలనా వైఫల్యాలు గురించి ప్రజలకు వివరించారు. టీడీపీని గెలిపిస్తే నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి, పాఠశాలలకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ. 15 వేలు నగదు, ప్రతి రైతుకు ఏడాదికి రూ. 20 వేలు నగదు, మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామని తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, మాజీ ఎంపీపీ వై. కృష్ణవేణి, తాళ్లవలస ఎంపీటీసీ సభ్యుడు కె. రమణ, జడ్పీటీసీ మాజీ సభ్యుడు అప్పారావు, మొల్లి లక్ష్మణరావు, పతివాడ రాంబాబు పాల్గొన్నారు. అంతకుముందు జాతీయ రహదారి పక్కనున్న రామాలయానికి వెళ్లి శ్రీభరత్ ప్రత్యేక పూజలు చేశారు.

13వ వార్డులో వెలగపూడి ప్రచారం

ఆరిలోవ : వచ్చే ఎన్నికల్లో ప్రజలు టీడీపీని గెలిపించడం ద్వారా రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు కోరారు. బుధవారం ఆయన 13వ వార్డు ఎస్ఎస్ఎన్ నగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా, చంద్రబాబును ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు పత్రకండ దర్మారావు. ప్రధాన కార్యదర్శి యల్లమలమల్లి సురేష్, వార్డు మహిళా అధ్యక్షురాలు మజ్జి రమణి, పార్లమెంటరీ కార్యదర్శి ఏడువాక సన్యాసిరావు. 12వ వార్డు అధ్యక్షుడు గాడి సత్యం, 11వ వార్డు అధ్యక్షుడు ముగడ రాజారావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బుడుమూరు గోవింద్. 13వ వార్డు క్లస్టర్ ఇన్‌చార్జి తురకపూడి బాలస్వామి, వేదుల సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారుకు రిజిస్ట్రేషన్ పత్రం అందిస్తున్న ఎంపీ సత్యనారాయణ

అర్హులందరికీ ఇళ్లు : ఎంపీ ఎంవీవీ

ఎంవీపీ కాలనీ, మార్చి 13 : పేదల సొంతింటి కల నెరవేరాలన్నదే ముఖ్యమంత్రి జగన్ లక్ష్యమని వైసీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త, ఎంపీ సత్యనారాయణ అన్నారు. బుధవారం ఆయన ఎంవీపీ కాలనీ ఏఎస్ రాజా మైదానంలో జగనన్న కాలనీల లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ పాలనలో పేదరికం ఆరు శాతం తగ్గిందని చెప్పారు. అనంతరం ఇటీవల సోషల్ మీడియా ట్రోలింగ్ వల్ల ఆత్మహత్యకు పాల్పడిన గీతాంజలి మృతి పట్ల కాసేపు మౌనం పాటించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, ఏపీడీలు దుర్గాప్రసాద్, గంగాధర్, గన్నమనేని వెంకటేశ్వరరావు, మొల్లి అప్పారావు, కృపా జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ రంగుల బెలూన్లతో వేదిక

కాగా ఏపీడీలు కింద తిరుగుతున్నా, ఇద్దరు ఆర్పీలను మాత్రం వేదిక మీద కూర్చోబెట్టడం జీవీఎంసీ ఉద్యోగులు ఆశ్చర్యపోయారు. అధికారిక కార్యక్రమానికి జోనల్ కమిషనర్ అధ్యక్షత వహించాల్సి ఉండగా, వైసీపీ నాయకుడు ఒకరు సభాధ్యక్షత వహించారు. పార్టీ రంగుల బెలూన్లతో వేదికను అలంకరించారు.

ఆరిలోవ : రవీంద్రనగర్‌లోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎంపీ ఎంవీవీ సత్యన్నారాయణ అన్నారు. బుధవారం ఆయన రవీంద్ర నగర్‌లో పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా విశ్వ కర్మలతో సమావేశమయ్యారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని గెలిపించాలని కోరారు.

పెరటి తోటల పెంపకంపై ఆసక్తి చూపాలి

- డీఆర్‌డీఏ పీడీ శోభారాణి



శిక్షణలో మాట్లాడుతన్న పీడీ శోభారాణి

పద్మనాభం,మార్చి 13 : మహిళలు పెరటి తోటల పెంపకంపై ఆసక్తి చూపాలని డీఆర్‌డీఏ పీడీ ఎం.శోభారాణి చెప్పారు. పద్మనాభంలోని స్త్రీశక్తి భవనంలో బుధవారం మండల సమాఖ్య పరిధిలోని సభ్యులకు పోషకాహారం - ఆరోగ్య సంరక్షణపై నిర్వహించిన శిక్షణలో ఆమె మాట్లాడారు. వీఓఏలు శిక్షణలో నేర్చుకున్న అంశాలను గ్రామాల్లోని డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. మహిళలు పూర్తి ఆరోగ్యంగా ఉండాలంటే పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని చెప్పారు. అలాగే పెరటి కోళ్లు కూడా పెంచుకోవడం వల్ల ఆదాయంతో పాటు పోషకారం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం ప్రభాకరరావు, రీసోర్సు పర్సన్లు రేణుకాశ్రీ గౌరి, రంగారావు పాల్గొన్నారు.

దుర్వాసనతో అవస్థలు

ఆరిలోవ, మార్చి 13 : జీవీఎంసీ 13వ వార్డు శ్రీకాంత్‌నగర్ కాలనీకి ఆనుకుని ఉన్న జేఎన్ఎన్‌యూ ఆర్ఎం కాలనీలోని బృందావన్‌లో చెచెత్త పేరుకుపోయి మినీ డంపింగ్ యార్డును తలపిస్తోంది. ముఖ్యంగా కాలనీకి ఆనుకుని ఉన్న కొండ వద్ద పెద్ద ఎత్తున చెత్త నిల్వ ఉంది. దీంతో విపరీతమైన దుర్వాసన వస్తుండడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. దోమలు వ్యాప్తి చెందుతుండడంతో రోగాల బారిన పడుతున్నారు. చెత్తను తొలగించమని స్థానికులు అధికారుల దృష్టికి పలు మార్లు తీసుకువెళ్లినా.. ఎవరూ పట్టించుకోవడం లేదు.



కాలనీలో పేరుకుపోయిన చెత్త

ఘనంగా కవయిత్రి మొల్ల జయంతి



మొల్ల చిత్రపటానికి పూలమాల వేస్తున్న దృశ్యం

కొమ్మాది, మార్చి 13 : బక్కన్నపాలెం 16వ పోలీస్ బెటాలియన్‌లో తొలి మహిళా కవయిత్రి ఆతుకూరి మొల్ల జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. బెటాలియన్ కమాండెంట్ గౌతమి శాలీ ఆధ్వర్యంలో పలువురు మొల్ల చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ పద్మనాభరాజు, అసిస్టెంట్ కమాండెంట్లు జి.ఇళయసాగర్, డీఎస్పీ దేవానంద్, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



గరుడ సేవలో పాల్గొన్న భక్తులు

సింహాచలం, మార్చి 13 : వరాహలక్ష్మీనృసింహస్వామికి పలు ఆర్జిత సేవలను బుధవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు.ఉత్సవమూర్తి గోవింద రాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు.అనంతరం ఆగమశాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. అలాగే ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని రజిత గరుడ వాహనంపై ఉంచి నృసింహ అష్టోత్తర శతనామావళి అర్చన చేశారు.

నేడు సత్తెమ్మ తల్లి జాతర



సింహాచలం, మార్చి 13 : అడివివరం గ్రామస్తుల ఆరాధ్య దేవత, అప్పన్నస్వామి సోదరి సత్తెమ్మతల్లి (మరిడిమాంబ) వార్షిక జాతరను గురువారం నిర్వహించనున్నట్టు ఆలయ అభివృద్ధి కమిటీ గౌరవాధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, అధ్యక్షుడు వెంకట్రావు తెలిపారు. బుధవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. జాతరను పురస్కరించుకుని అమ్మవారి విశేష అలంకరణకు అవసరమన నూతన వస్త్రాలు, పలు అభరణాలను కమిటీ సభ్యులు కానుకగా సమర్పించారు.

సింహాచలం డిపో ఆదాయం రూ.17.7 లక్షలు

సింహాచలం, మార్చి 13 : మహా శివరాత్రి సందర్భంగా ఈనెల 8న ప్రత్యేక సర్వీసుల ద్వారా సింహాచలం ఆర్టీసీ డిపోకు రూ. 17.7 లక్షల ఆదాయం సమకూరినట్టు డిపో మేనేజర్ రాజశేఖర్ తెలిపారు. బుధవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో సింహాచలం కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన కార్మికుల అభినందన సభలో ఆయన మాట్లాడారు. డిపో పరిధిలో మొత్తం స్పెషల్ సర్వీసులు 38145 కిలోమీటర్ల ప్రయాణాలు సాగించాయని, వాటి ద్వారా రూ.17,74,094 ఆదాయం లభించిందన్నారు. పాడేరు మార్గంలో నడిపిన ఆరు ప్రత్యేక సర్వీసుల ద్వారా రూ.1,38,572 లక్షలు, ఆర్కే బీచ్‌కు నడిపిన 14 సర్వీసుల ద్వారా రూ.2,36,304 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. ఈమేరకు ఆయన కండక్టర్లు, డ్రైవర్లను అభినందించారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

వెంకోజీపాలెం, మార్చి 13 : మద్దిలపాలెం ఐసీడీఎస్ సెక్టారు-2 పరిధిలోని అంబేడ్కర్ కాలనీలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు పోషకాహార లోపం ఉన్న తల్లులు, రెండేళ్ల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు తలెత్తే సమస్యలు గురించి వివరించారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంతో ఉండవచ్చునని సూచించారు.



రోగులకు మందులు అందిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

రామ్‌నగర్‌లో 800 మందికి వైద్య పరీక్షలు

రామ్‌నగర్, మార్చి 13 : రామ్‌నగర్ బజారు జంక్షన్‌లో ఎన్‌టీఆర్ సేవా సమితి, ఎంవీవీఎస్ మూర్తి ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ప్రారంభించగా గీతం వైద్యులు 800 మందికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఊటగడ్డ పితానివీధి, జై సంతోషిమాత కాలనీ, బాలాజీ నగర్ తదితర ప్రాంతాలకు చెందిన ప్రజలు శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ అధికార ప్రతినిధి, వార్డు ఇన్‌చార్జి నక్కా కన కరాజు, నాయకులు అప్పలనారాయణ, ఉరుకూటి పైడిరాజు, నల్ల అప్పలరాజు, సన్యాసిరావు, సారిపల్లి మహేష్, సూర్యారావు, ఎన్. శంకరరావు, కనకమహాలక్ష్మి, డిల్లీశ్వరి పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

భీమునిపట్నం : జీవీఎంసీ 3వ వార్డులో రూ. 1.29 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎగువపేట సచివాలయం ఆవరణలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ భీమిలి జోన్‌లో వున్న నాలుగు వార్డుల్లో రూ. 502 కోట్ల అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలకు ఖర్చు చేయగా అందులో ఒక్క 3వ వార్డులోనే రూ.102 కోట్లు వెచ్చించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో 3వ వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండ, జడ్పీ కనకమహాలక్ష్మి, వైసీపీ వార్డు అధ్యక్షుడు అల్లిపిల్లి నర్సింగరావు, నాయకులు కదిరి ఎల్లాజీ, గుండాసు మధునాయుడు, వాసుపల్లి కొండబాబు, బూర నాగరాజు, బుత్తల ప్రతాప్ పాల్గొన్నారు.

కాగా 4వ వార్డు నిడిగట్టు-నేరేళ్లవలస గ్రామంలో జగనన్న చేయూత కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని డ్వాక్రా సభ్యులకు రూ.6.78 కోట్ల చేయూత సొమ్ము నమూనా చెక్కు అందజేశారు.కార్యక్రమంలో కార్పొరేటర్ ఏడుకొండలరావు, వైసీపీ నాయకుడు రమణారెడ్డి, జడ్పీ కనకమహాలక్ష్మి పాల్గొన్నారు.

కొమ్మాది : వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగిస్తుందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఆయన ఆరో వార్డులో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వార్డు వైసీపీ అధ్యక్షుడు బొట్టా అప్పలరాజు, పిళ్లా కృష్ణమూర్తిపాత్రుడు, ఎల్లాజీ, రాయన సాయి పాల్గొన్నారు.

16 నుంచి యల్లమాంబ జాతర

వెంకోజీపాలెం, మార్చి 13 : జీవీఎంసీ 15వ వార్డు పాతవెంకోజీపాలెం యల్లమాంబనగర్‌లో ఉన్న యల్లమాంబ అమ్మవారి జాతర ఈనెల 16 నుంచి నిర్వహించనున్నట్టు కాలనీ సేవా కమిటీ కార్యదర్శి కాళ్ల కుమార్ తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 16న తొలేళ్లు, 17న జాతర ఉంటుందన్నారు.ఆరోజు తెల్లవారుజాము నుంచి అమ్మవారికి పూజలు, అభిషేకాలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం మహా అన్నదానం ఉంటుందని చెప్పారు.

దిబ్బడిపాలెంలో ఘనంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

భీమునిపట్నం, మార్చి 13 : బీచ్‌రోడ్ మంగమారిపేట కాపుల దిబ్బడిపాలెంలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ బుధవారం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక భావం ప్రజల్లో స్నేహభావాన్ని పెంపొందిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ భగవంతుని నామ స్మరణతో సన్మార్గంలో నడవాలని కోరారు. ఈ కార్యక్రమంలో 4వ వార్డు కార్పొరేటర్ దౌలపల్లి ఏడుకొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

'కష్టించే తత్వం ఉంటేనే భవిష్యత్తు'

వెంకోజీపాలెం, మార్చి 13 : కష్టపడి పనిచేసే తత్వం కలిగి ఉంటే ప్రగతికి మార్గం సుగమం అవుతుందని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం. జేమ్స్ స్టీఫెన్ అన్నారు. ఏయూ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం దినోత్సవంలో ఆయన మాట్లాడారు. లక్ష్యాలను స్థిరపరుచుకోవడం, నిత్యం వాటిని సాధించే దిశగా ప్రయత్నించడం వల్ల భవిష్యత్తులో ఉన్నత ఫలితాన్ని అందిస్తుందన్నారు. అనంతరం సదస్సు ప్రత్యేక సంచికను ఆయన ఆవిష్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.కె.భట్టి విద్యార్థుల ప్రతిభను, ప్రగతిని వివరించారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఎస్. అరుణ, ఆచార్య పీవీ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కేంద్ర బలగాల కవాతు



అనంతవరం గ్రామంలో కేంద్ర బలగాల ఫ్లాగ్‌మార్చ్

పద్మనాభం, మార్చి 13 : మండలంలోని అనంతవరం, గొల్లలపాలెం, పెంట, పాతకొవ్వాడ, కొత్తకొవ్వాడ, గంధవరం, మద్ది, బాందేవుపురం, విలాస్‌ఖాన్‌పాలెం, పల్లి, కోరాడ, బుడ్డివలస, లింగన్నపేట, గెద్దపేట, బీఆర్ తాళ్లవలసలో సీఐఎస్ఎఫ్ బలగాలు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించాయి. సీఐ శ్రీధర్, ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

మహిళల సంక్షేమమే ధ్యేయం : వైవీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న వైవీ సుబ్బారెడ్డి

సిరిపురం, మార్చి 13 : మహిళల ఆరోగ్యం, సంక్షేమమే వైసీపీ ప్రభుత్వ ధ్యేయమని ఆ పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం సిరిపురంలోని గురజాడ కళాక్షేత్రంలో కిమ్స్, మెడికవర్ సౌజన్యంతో మహిళల కోసం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా సంక్షేమం కోసం వైసీపీ ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ హరి వెంకటకుమారి, ఫ్లోర్ లీడర్ బి.శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్ శ్రీధర్, సతీష్, బొత్స ఝాన్సీ, కేకే రాజు, ఆడారి ఆనంద్, మోప్మా ఎండీ విజయలక్ష్మి పాల్గొన్నారు.